RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 90 ISSUE NO : 90 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, సెప్టెంబర్, 24, 2025 Wednesday, September, 24, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /- |
|---|---|---|---|---|---|



మీ పార్టీ మాజీ నాయకుల విగ్రహాల కోసం

## ప్రజల సొమ్ము వాడొద్దు

- తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురు
- కరుణానిధి విగ్రహం ఏర్పాటు ప్రతిపాదనను తిరస్కరించిన న్యాయస్థానం
- నేతల కీర్తి కోసం ప్రజాధనం వాడొద్దని ప్రభుత్వానికి స్పష్టం

ఢిల్లీ,: తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ నేతల విగ్రహాల ఏర్పాటు కోసం ప్రజాధనాన్ని వినియోగించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "మీ మాజీ నాయకుల గొప్పతనాన్ని చాటుకోవడం కోసం ప్రజల సొమ్మును ఎలా ఖర్చు చేస్తారు? దీనికి మేం అనుమతి ఇవ్వలేం" అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

మేడారం ఆలయ అభివృద్ధిలో..

# ఖర్చుకు వెనుకాడం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**మేడారం,తెలంగాణ దిశ :** ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈపనులతో మంత్రి సీతక్కతోపాటు తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "సమ్మక్క- సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క -సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చాను. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



ట్రంప్ చర్యలతో

ఇంటాబయటా

## విమర్శలు

**వీసా ఫీజుల పెంపుతో అమెరికాకు నష్టమే**
**కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, :హెచ్1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనంసృష్టించడం ఒక ఎత్తయితే , దీనిపై దేశీయంగా, విదేశాల్లోనూ విమర్శలు వెల్లువెత్తున్నాయి. ట్రంప్ నిర్ణయంపై టెక్ కంపెనీలు సమాలోచనలు చేస్తున్నాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కారణాలతోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్నారు.



కెసిఆర్ కుటుంబ జల్సాలకు

## రాష్ట్రం తాకట్టు

**లక్షల కోట్లు అప్పలు చేసి ఆగంచేసారు**
**మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

**ఖమ్మం, తెలంగాణ దిశ :** రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి తెచ్చిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే.. పదేండ్లు పరిపాలించిన నాయకు లు అడ్డగోలుగా మాట్లాడుతున్నా రని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశా రు. అక్రమాలు నిలదీస్తే సమాధా నంచెప్పడం లదన్నరు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని భావించి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కుటుంబం చేతిలో పదేండ్లు తెలంగాణ బందీ అయ్యిందన్నారు.

## తాల్ హెల్త్‌ఫెస్ట్ 2025కు ముఖ్య అతిథిగా కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరి సిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జర గనున్న ప్రతిష్టాత్మక 'తాల్ హాస్పిట ల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025' కార్యక్రమా నికి ఆయన ముఖ్య అతిథిగా హాజ రు కావాలని ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానాన్ని తాల్ హాస్పిటల్స్ సీఈఓ శ్రీ సాయి గుండవెల్లి హైద రాబాద్‌లో కేటీఆర్‌కు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ సాయి గుండవెల్లి వెంట ఉన్నారు.అక్టోబర్ 24, 2025న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహించనున్నారు.






ఐఏఎస్ అధికారుల్లో..

## నిర్లిప్తత

**ఎదురు తిరుగుతున్న అధికారులు**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రేవంత్ ముఖ్యమంత్రి అయిన తొలి రోజులవి. కాళేశ్వరం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై శ్వేత పత్రాలు విడు దల చేయాలని ప్రభుత్వం భావిస్తున్న రోజులు కూడా అదే. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆదేశించినప్పటికీ కొన్ని కీలక ఫైల్స్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కూడా చెప్పుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి అడిగిన అనేక సందర్భాలలోనూ అధికారులు ఇదే ధోరణి ప్రదర్శించారు. తట్టుకో లేక ముఖ్యమంత్రి వారికి స్థానచలనం కలిగించారు. వారంతా గులాబీ పార్టీకి అనుకూలమైన వ్యక్తులని.. అందువల్లే ఎవరి మాటా వినరని సెక్రటేరియట్ లో ప్రచారం జరుగుతుంటుంది. తాజాగా ఓ మంత్రికి ఐఏఎస్ అధికారి నుంచి దారుణమైన సమాధానం ఎదురయింది. ఒక రకంగా ఆయన పరువు కూడా పోయింది. ఇంతకీ ఏం జరిగిందంటే..
తెలంగాణలో మలి దశ మంత్రివర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి లభించింది. ఆయన మంత్రి కావడం ఇదే తొలిసారి. సహజంగానే ఆయన ఉత్సాహంగా పనిచేస్తుంటారు. ఇటీవల కాలంలో తన శాఖకు సంబంధించిన కొన్ని ఫైల్స్ తన పేషి లో పనిచేస్తున్న సెక్రటరీకి పంపించారు. వాస్తవానికి వాటిపై వెంటనే సంతకాలు చేసి పంపించాల్సిన బాధ్యత సెక్రటరీ మీద ఉంటుంది. కానీ ఆ సెక్రెటరీ సీనియర్ ఐఏఎస్ అధికారి. పైగా గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ పెద్దలతో ఆయన విపరీతంగా అంట కాగారు..



మిషన్ భగీరథతో

## 42వేల కోట్లు వృధా

- ఒక్క ఇంటికీ నీరు ఇచ్చిన దాఖలాలు లేవు
- రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన కెసిఆర్ ప్రభుత్వం
- మంత్రి వివేక వెంకటస్వామి విమర్శలు

**మంచిర్యాల, తెలంగాణ దిశ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం అట్టర్ ఫ్లాప్ అని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. 42 వేల కోట్ల రూపాయలతో మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చి ఒక్క ఇంటికి చుక్క తాగు నీరు అందించ లేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాల పేరుతో వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచుకుందని విమర్శించారు.

# స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వండి

## - జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ఉప్పల్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను కోరారు. మంగళవారం జిహెచ్ఎంసి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా శ్రీ నగర్, కృష్ణారెడ్డి నగర్ లలో 550 మీటర్ల స్టార్మ్ వాటర్ డ్రైన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే సానుకూలంగా స్పందించిన జిహెచ్ఎంసి కమిషనర్ రూ. 2 కోట్ల 85 లక్షలు మంజూరు చేశారని ఆయన తెలిపారు. సాయి నగర్ ఆర్చి నుంచి టిఎఫ్ ఐఆర్ వరకు కాంపౌండ్ వాల్ కృష్ణారెడ్డి నగర్ రోడ్డు నంబర్ 1, రోడ్డు నంబర్ 2 ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జోనర్ కమిషనర్ ను ఆదేశించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా కాలనీలు ముంపుకు గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టే విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరీ మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలోకి ఎగువ నుంచి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఉమా మహేశ్వర కాలనీలో మంగళవారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. అకాల వర్షాలతో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరదతో ఉమా మహేశ్వర కాలనీ వాసుల ఇళ్లలోకి నీరు చేరకుండా వర్షపు నీటి వరదను మళ్లించాలని అధికారులకు సూచించారు. అంతే కాకుండా పక్కన ఉన్న కాలనీ ప్రహరీ గోడ కూల కుండా చర్యలు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శిరీష ప్రవీణ్ రావు, దప్పు కిరణ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు భూ లక్ష్మణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. మంగళవారం బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఏడవ బ్లాక్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వివేకానంద్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో మౌలిక వసతుల కల్పనలో సముదాయ వాసులకు, ప్రజాప్రతినిధులకు సంక్షేమ సంఘం సభ్యులు వారధిగా నిలవాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, 2బిహెచ్ కె కో- ఆపరేటివ్ సొసైటీ ఏడవ బ్లాక్ నూతన చైర్మన్ షేక్



అజ్మీరి అహ్మద్, వైస్ చైర్మన్ కె. లక్ష్మీ నరసింహ, సెక్రటరీ ఎ. సునీత మోహన్, కోశాధికారి కె. లావణ్య భాస్కర్, సంయుక్త కార్యదర్శి షాహిన్ శర్మ, మనీష్ శర్మ, సత్యవతి, రోహిణి కృష్ణ, సంధ్యా రాణి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కూల్చిన చోటే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి



## - సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీ

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**పేదలు నివసిస్తున్న ఇండ్లను కూల్చిన చోటే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. మంగళవారం గాజుల



రామారం పరిధిలోని పలు బస్తీలలో పేదల ఇండ్లు కూల్చివేసిన ప్రదేశాన్ని సిపిఎం రాష్ట్ర కంట్రోల్ చైర్మన్ డిజి. నరసింహారావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి సత్యం, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుగాని లక్ష్మణ్ జిల్లా కమిటీ నాయకులు బి. వెంకట రామయ్య, ఎం. శంకర్, రాథోడ్ సంతోష్ లతో కలసి ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ చిన్న చిన్న ఇల్లు కట్టుకొని ఎన్నో ఏళ్ల నుంచి క్వారీ గుంతలలో పనిచేస్తూ అక్కడే నివసిస్తున్న వారిపై హైడ్రా ఆదివారం ఇండ్లను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పేదలను చూసి ఓర్వలేక పోతుందన్నారు. బడా బడా పెట్టుబడిదారులను కాపాడుతూ పేదలపై హైడ్రా పేరు మీద దాడులు చేస్తున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాల వెంకటేశ్వరరావు, బాల పీర్, శ్రీను, దేవదానం, ఎండి. ముక్తార్, వజీర్, ఎండి మోసిన్, శ్రీనివాస్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గృహకల్పలో స్వచ్ఛ సర్వేక్షన్





**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో రాజీవ్ గృహకల్పలో మంగళవారం "స్వచ్ఛ సర్వేక్షన్" కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను పరీక్షించి అవసరమైన మందులను అందజేశారు. చీర్యాల శివాలయం వద్ద పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి సామూహిక పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తా చెదారాన్ని తొలగించి వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. తద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చునన్నారు. స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఇందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్ స్పెక్టర్ రాంరెడ్డి, వైద్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ ప్రజలు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గృహకల్ప అభివృద్ధికి సహకరిస్తా : వివేకానంద్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప నూతన సంక్షేమ సంఘం సభ్యులు చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో గతంలో మంచినీటి ఎద్దడి సమస్య పరిష్కారంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామని అన్నారు. భవిష్యత్తులో కూడా రాజీవ్ గృహకల్ప సముదాయం లబ్ధిదారులకు అవసరమైన అన్నీ వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాజీవ్ గృహకల్ప సముదాయం నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మారావు అంజయ్య, కార్యదర్శి ఎం. భూపతి రెడ్డి, రాజీవ్



గృహకల్ప వాసులు పరశురామ్, కరికే నవీన్, వైకుంఠం, పాండు, వెంకట్, చంద్రమౌళి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**మేడ్చల్ కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనికలు కొలతలు, కార్మిక శాఖలతో పాటు హౌజ్ కీపింగ్ వారి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ ఉత్సవాలలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాధిక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక అని అన్నారు. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, సమాజంలో వారి ఔన్నత్యానికి దోహదం చేస్తుందన్నారు. బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక అని అన్నారు. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొన సాగింది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులకు శుభ్రతతో రుచికరమైన ఆహారాన్ని అందించాలి

## - మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా







**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :**చిన్నారులకు శుభ్రతతో రుచికరమైన ఆహారాన్ని అందించాలని, ఆట పాటలతో చదువు నేర్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. "పోషన్ భీ, పడాయి భీ" ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శామీర్ పేట మండలం ఆలియాబాద్ అంగన్ వాడి సెంటర్ ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

చిన్నారులతో ముచ్చటిస్తూ వారి ఆట పాటలను చూస్తూ సంతోషం వ్యక్తం చేసారు. వంట సామాగ్రిని పరిశీలించి, అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, అంగన్ వాడీ టీచర్ చిన్నారులు పాల్గొన్నారు.

# పేదవారికి పెద్దవారికి ఒకటే న్యాయం ఉండాలి.. ఆకుల సతీష్ టీమ్





పేదవారికిపెద్దవారికి ఒకటే న్యాయం ఉండాలని ఆకుల సతీష్ టీమ్ కోరింది. హైడ్రా, జిల్లా రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్ 307లో ఆక్రమణలు కూల్చివేస్తే, హైకోర్టులో (29001/2025) 307లోనే మరొక కేసు మంగళవారం బెంచ్ మీదకి వస్తున్నందున అప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న అంశాన్ని సాకుగా తీసుకొని హైడ్రా ప్రభుత్వాధికారులు వేసిన పెన్సింగ్ ను ఎమ్మెల్యే గాంధీ కుటుంబ సభ్యుల మనుషులు తొలగించి, సొంత ఫెన్సింగ్ వేయడంపై తక్షణమే పోలీస్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టులో సరైన వాదనలు వినిపించి ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేసారు.

– (కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)

# సంపాదకీయం

## అనర్థదాయకం..!

సామాన్యులకు ఎంతోకొంత ఊరటగానున్న ఆరోగ్యశ్రీ పథక సేవలను, రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం అనర్థదాయకం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది జనాన్ని వైద్య ఆరోగ్య సేవలకు దూరం చేయడమే అవుతుంది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు బీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ.2.5 లక్షల వరకు, ఆపైన ఖర్చయితే ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు కవరేజ్ ఉంటుందన్నది ప్రచారానికి బాగానేవుంటుంది. దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2 నుంచి 5లక్షల వరకు బీమా కవరేజ్‌ను అందిస్తామనీ ఇదంతా కలిపి యూనివర్సల్ హెల్త్ కవరేజి అని సర్కారు నమ్మబలుకుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 2015-16ల్లో ఎపిఎల్ కుటుంబాలకూ హెల్త్ కవరేజి అని ప్రచారం చేసి ప్రీమియంలు కట్టించుకున్నారేకానీ ప్రజలకు లబ్ధి చేకూరిన దాఖలాల్లేవు. తాజా పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందజేస్తారని, ప్రతి రోగికి ఒక క్యూఆర్ కోడ్ ఇచ్చి అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్న అమాత్యుల మాట నీటిమీద రాతగానే మిగిలిపోవచ్చు. రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించగా తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కళాశాలలో అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయి. ప్రైవేటు యాజమాన్యాలు మెరిట్ పక్కనబెట్టి సంపన్నులకే సీట్లు ఇస్తాయి కనుక పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం అవుతారు. వ్యాపార దక్పథం ముందుకు వచ్చి పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. వైద్య ఆరోగ్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని అనేక దేశాల్లో నిరూపితమైంది. యుకె, నెదర్లాండ్స్ ఇంకొన్ని స్కాండినేవియన్ దేశాల్లో ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నడుస్తోంది. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యమవుతుంది. ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలు వ్యాపారం చేస్తాయే కానీ సేవ చేయవు. అనర్థదాయకమైన ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొని ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్య సేవలను కొనసాగించాలి. సెల్ఫ్‌ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జిఓ 107, 108ని రద్దు చేయాలి. ఇదిలావుండగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించి ప్రైవేటు పంప్డ్ స్టోరేజి హైడ్రో ప్రాజెక్టుకు అనుమతులిచ్చిన ప్రభుత్వం గురువారంనాటి క్యాబినెట్ సమావేశంలో వాటి సామర్థ్యం పెంచడం, నీటి కేటాయింపులను కూడా చేయడం దారుణం. జలవనరుల శాఖ మార్గదర్శకాలు, లభ్యతకు అనుగుణంగా కేటాయింపులకు ఆమోదం తెలిపామని చెబుతున్నా ఆచరణలో నదుల్లోని నీటిని విద్యుత్ ప్రాజెక్టులే పొందుతాయి కనుక దిగువనున్న ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కడప జిల్లా కొండాపురం మండలంలో చింత గ్రీన్ ఎనర్జీ కొప్పోలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు ఏకంగా గండికోట రిజర్వాయర్‌ను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగించడానికి ఆమోదం తెలపడం ప్రమాదకరం. గత వైసిపి ప్రభుత్వ పెద్దలు లంచాలు బొక్కి ఒప్పందాలు చేశారని అమెరికాలో కేసులు వచ్చిన సెకి చేసిన సత్యసాయి జిల్లా ముత్తుకుంట గ్రామంలో రూ.800 కోట్ల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలపడం ద్వారా ఇప్పుడు కూడా గత పాలకుల విధానాలే కొనసాగుతున్నాయని చెప్పడమే అవుతుంది. సామాన్యులకు అందే వైద్య ఆరోగ్య సేవలను వారికి దూరం చేసి అదాని అంబానీ వంటి కార్పొరేట్లకు కాసులు కురిపించే విధానాలను ప్రభుత్వం విడనాడాలి. అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి. లేకపోతే రాష్ట్ర ప్రజలకు హాని జరగడమేగాక ప్రభుత్వానికి కూడా రాజకీయంగా చేటు కలగవచ్చు

# కౌండిన్య నగర్ లో పుట్ట గొడుగులా అక్రమ నిర్మాణం...


## చోద్యం చూస్తున్న అధికార గణం - జిహెచ్ఎంసి ఆదాయానికి గండి



**నాచారం, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :** నాచారం కౌండిన్య నగర్ లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చిన అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. నోటీసులు ఇచ్చు మరి కోర్టు నుంచి స్టేట్ తెచ్చుకోమని సలహా ఇస్తున్నారు. కేవలం 121 గజాలలో మూడు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని ఆరు ఫ్లోర్ల అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్న అధికారులలో చలనం లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నాచారం కౌండిన్యనగర్ లో సర్వే నెంబర్లు 83, 84, 85, 86/1లో జరుగుతున్న తతంగమిది. పేదవాడు ఇటుక తీసి ఇటుక పెడితే జూలూమ్ ప్రదర్శించే సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు మూడు అదనపు అంతస్తులు అక్రమంగా నిర్మిస్తున్నా... ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. మూడంతస్తుల భవన నిర్మాణం కోసం జిహెచ్ఎంసి నుంచి అనుమతులు తీసుకొని రూ. 1.60 లక్షలు చెల్లించిన భవన యజమాని, మరో మూడంతస్తుల నిర్మాణానికి రూ. 1.60 లక్షలు ఎగ్గొట్టినట్లే. అసలు 120 గజాలలో ఆరు అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదు. ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా అక్రమంగా జరుగుతున్న ఈ నిర్మాణంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. "తిలా పాపం తలా పిడికెడు" అన్నట్లు ఎవరికి దొరికినంత వారు దోచుకొని పక్కకు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదులు వస్తున్న పట్టించుకోని అధికారులు...

**ఈ అక్రమ నిర్మాణం పై అనేక ఫిర్యాదులు వస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణానికి కొంతమంది అండదండలు ఉండడం వల్లే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. ఒకరిని చూసి మరొకరు డివిజన్ వ్యాప్తంగా అనేక అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.**



OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION TG-bPASS

TG-bPASS - BUILDING PERMIT ORDER

To,

Sri. V.DEVENDER GOUD
S/o LATE V.YADAIAH GOUD
4-4-64, VEERAREDDY COLONY
NACHARAM, UPPAL, 500076

| | |
|---|---|
| Application No / Permit No | 493202/GHMC/4678/2025 |
| Permit No. | 493202/2366/GHMC/2025 |
| Date | 19-03-2025 |

Sir/Madam,

Sub: Greater Hyderabad Municipal Corporation - Construction of Individual Residential Building consisting of Stilt for Parking + 2 Upper Floor to an extent of 101.17 Sq.Meters (121.0 Sq.Yds)situated at Plot No: 81, Locality: KOUNDINYA NAGAR, Survey No: 83,84,85 AND 86/1, Nacharam(V), Kapra Circle 1, LB Nagar Zone, Uppal(M), GHMC, Medchal - Malkajgiri(Dist) - Building Permission-Instant Approval issued - Reg

Ref:
1. Your Application dated: 19-03-2025
2. G.O.Ms.No.168, MA&UD, dt.07-04-2012 and its time to time amendments.

Your application for individual Residential building permission submitted in the reference cited has been sanctioned based on the Self Certification given by you as detailed below and subject to conditions mentioned therein:

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| A | APPLICANT DETAILS | | | | | | | |
| 1 | Name | Sri V.DEVENDER GOUD | | | | | | |
| B | SITE DETAILS | | | | | | | |
| 1 | Survey No | 83,84,85 AND 86/1 | | | Plot No | 81 | | |
| 2 | LRS APPLIED IN 2019-2020 | C/GHMC/019551/2020 | | | | | | |
| 3 | Street/Road | N/A | | | Locality | KOUNDINYA NAGAR | | |
| 4 | Village Name | Nacharam | | | | | | |
| 5 | Circle Name | Kapra Circle 1 | | | | | | |
| 6 | Mandal Name | Uppal | | | | | | |
| 7 | Zone Name | LB Nagar Zone | | | | | | |
| 8 | District Name | Medchal - Malkajgiri | | | | | | |
| C | DETAILS OF PERMISSION SANCTIONED | | | | | | | |
| 1 | Extent of Plot | 101.17 Sq.Mtrs (121.0 Sq.Yds) | | | | | | |
| 2 | Road Affected area | 0.0 Sq. Yards | | | | | | |
| 3 | Net Plot Area | 121.0 Sq. Yards | | | | | | |
| 4 | Floors | | Ground Floor | Upper Floor/s | | Parking Floor/s | | |
| a | Use | Sub-use | Area (Sq. Yards) | No | Area (Sq. Yards) | Level | No | Area (Sq. Yards) |
| b | Residential | Individual Residential Building | 0.0 | 2 | 137.4 | Stilt | 1 | 68.7 |
| 5 | No of floors | Stilt for Parking + 2 Upper Floor | | | | | | |
| 6 | Height | 6 Mts | | | | | | |
| 7 | Setbacks (Mts) | Front | Rear | | Side-I | | Side-II | |
| | | 1.5 | 1.0 | | 1.0 | | 1.0 | |
| 8 | No. of Rain Water Harvesting Pits | 1 | No. of Trees | | 5 | | | |
| D | MORTGAGE DETAILS | | | | | | | |
| 1 | Mortgage Area | N/A | | SRO | N/A | | | |
| 2 | Floors Handed Over | N/A | | Date | N/A | | | |
| 3 | Mortgage No | N/A | | Market Value | ₹ 5000.0 | | | |
| E | DETAILS OF PAYMENT | | | | | | | |

# మల్లాపూర్ భవాని నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు

## కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ లో చట్టాలు పనిచేయవా...!? - ముడుపులు ఇస్తే చట్టాలతో పని లేదా...!?




**మల్లాపూర్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :** కాప్రా సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ డివిజన్ భవాని నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్న కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మక నిరీత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహం తోనే నిబంధనల విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలుస్తుంది. అక్రమ నిర్మాణదారుల నుంచి టౌన్ ప్లానింగ్ లోని కిందిస్థాయి సిబ్బంది లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం జరుగుతున్న కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలతో జిహెచ్ఎంసి ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతున్నట్లు జిహెచ్ఎంసి ఉద్యోగుల చెబుతున్నారు. జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారుల పేరు చెప్పి కిందిస్థాయి సిబ్బంది లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహి స్తున్నారు. ఇలా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు అందుతున్న జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఇదేనని తెలుస్తుంది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.



# ఘనంగా ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు








**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 23, (తెలంగాణ దిశ) :** ప్రభుత్వ చీఫ్ విప్, శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి ఆధ్వర్యంలో మహేందర్ రెడ్డికి బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కంసాని సీతారాంరెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకటరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పెద్ది నాగరాజు గుప్తా, అల్లూరయ్య, ఎస్ ఏ సాహెబ్, రహమతుల్లా, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఇక అమరావతి పరుగులు



**అమరావతి, తెలంగాణ దిశ :** అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం ఏడు అంశాలకు ఆమోదం తెలిపారు. అలాగే స్పెషల్ పర్పస్ వెహికల్ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేలా ఏపీ సర్కారు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడు అధ్యక్షతన మంగళవారం 52వ సీఆర్డీఏ అథారిటీ సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో అమరావతి నిర్మాణ పనులపై ప్రధానంగా దృష్టి సారించారు. రాజధాని అమరావతిలో కీలక నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబు ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అలాగే సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఏడు అంశాలకు ఆమోదం లభించింది.

అమరావతిలో కీలక ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ స్పెషల్ పర్పస్ వెహికల్ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసు కురావాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. అమరావతిలో హెల్త్ సిటీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ హెల్త్ సిటీ పరిధిలోనే బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఈ బయో డిజైన్ ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలు అందిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యులు అయ్యేందుకు ఏడు దేశాల నిపుణులు, సంస్థలు సిద్ధంగా ఉన్నాయని చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో బయో డిజైన్ ప్రాజెక్టును కూడా స్పెషల్ పర్పస్ వెహికల్ పరిధిలోకి తేవాలని ఆదేశించారు. మరోవైపు అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం, స్పోర్ట్స్ సిటీ, ఐకానిక్ బ్రిడ్జి, స్మార్ట్ ఇండస్ట్రీస్, రోప్ వే, రివర్ ఫ్రంట్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహదపడుతుంది. ఆయా ప్రాజెక్టుల డిజైన్ దగ్గర నుంచి రెవెన్యూ జనరేషన్, నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఎస్పీవీనే పూర్తి బాధ్యత వహించనుంది. మరోవైపు అమరావతి రాజధాని ప్రాంతంలో అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ గైడ్ లైన్స్ మీద చంద్రబాబు కీలక సూచనలు చేశారు. డిజైన్లను ఆమోదించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. అమరావతి ఆకర్షణీయంగా కన్పించేలాఉండాలని సూచించారు రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం ముందుకొచ్చిన సంస్థలకు భూములు ఇచ్చేందుకు సీఎం అంగీకారం తెలిపారు. మాస్టర్ ప్లాన్ అవసరాలకు అనుగుణంగా భూ సేకరణ చేపట్టాలంటే రైతులతో మాట్లాడి.. వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా చేపట్టాలని స్పష్టం చేశారు.

# ఒంగోలు జనసేనలో కుంపట్లు!

**ఒంగోలు, తెలంగాణ దిశ :** ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ? ఒడా ఛైర్మన్‌గా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ నియమితులయ్యారు. పదవీ స్వీకార కార్యక్రమాన్ని కూడా మాంఛి? అట్టహాసంగా నిర్వహించారు. పార్టీకి చెందిన కీలక నేతలు, టీడీపీ మంత్రులు, ఇతర ముఖ్య నేతలంతా అటెండయ్యారు. అయితే ఏంటంట? అదంతా రొటీనే కదా? ఇప్పుడు కొత్తగా చెప్పొచ్చేది ఏంటంటారా? జస్ట్ వెయిట్. అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఒడా ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అంతా హాజరయ్యారుగానీ? అదే?. జనసేనలో ఉన్న కీలక నాయకుడు, ఒంగోలు నియోజకవర్గానికే చెందిన మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి కనీసం కాకితో కూడా కబురు పెట్టలేదన్న వ్యవహారం పొలిటికల్‌గా కలకలం రేపుతోంది. అంతేకాక రియాజ్‌కు శుభాకాంక్షలు చెబుతూ పెట్టిన ఫ్లెక్సీల్లో కూడా ఎక్కడా బాలినేని ఫోటో కనీసం చిన్నదిగా కూడా వేయకపోవడం చర్చనీయాంశం అయ్యింది. దీని మీద బాలినేని వర్గం తీవ్ర స్థాయిలో ఫైర్ అవుతోందట. వైఎస్ కుటుంబ బంధువైన బాలినేని.. 2019 జగన్ తొలి కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. రెండున్నరేళ్ల తర్వాత పునర్వ్యవస్థీకరణలో బాలినేనిని తప్పించారు జగన్. గత ఎన్నికల్లో ఒంగోలు నుంచి మరోసారి పోటీ చేసి ఓడిపోయారాయన. అటు నియోజకవర్గంలో పుష్కర కాలంగా బాలినేని, టీడీపీ నేత దామచర్ల జనార్ధన్ మధ్య రాజకీయ వైరం కొనసాగుతోంది. నాలుగుసార్లు ఇద్దరూ ముఖాముఖి తలపడగా చెరో రెండుసార్లు గెలిచారు. అయితే? 2024 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో వైసీపీని వదిలి జనసేనలో చేరారు బాలినేని శ్రీనివాసరెడ్డి. ఒకే కూటమిలో ఉన్నా? బాలినేని, దామచర్ల మధ్య వైరం ఏ మాత్రం తగ్గలేదు. మాజీమంత్రి జనసేనలో చేరే సందర్భంలో కూడా తీవ్రంగా వ్యతిరేకించారు సిట్టింగ్ ఎమ్మెల్యే దామచర్ల. ఆ టైంలో ఫ్లెక్సీల చించివేతలు కూడా జరిగాయి. కూటమి అన్నాక కొన్ని సర్దుబాట్లు తప్పనిసరని స్వయంగా పవన్ కళ్యాణ్ ఇదే జిల్లాలో చెప్పాక కూడా మాజీ మంత్రి అనుచరులు పెట్టిన హరిహరవీరమల్లు సినిమా ఫ్లెక్సీలను తొలగించటం హాట్ టాపిక్ అయింది. ఈ పరిణామ క్రమంలో తాజాగా ఒడా ఛైర్మన్ పదవీ ప్రమాణ కార్యక్రమం గ్యాప్‌ను మరింత పెంచిందని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. అధికారిక కార్యక్రమం, పైగా సొంత పార్టీ నాయకుడు ఛార్జ్ తీసుకుంటున్న సందర్భం. అయినా సరే? మాజీ మంత్రికి ఆహ్వానం పంపకపోవడం గురించి గట్టిగానే మాట్లాడుకుంటున్నారు ఒంగోలు పొలిటికల్ సర్కిల్స్‌లో. ఇన్నాళ్ళు టీడీపీ వర్సెస్ జనసేన అన్నట్టుగా ఉన్న వార్? ఇప్పుడు జనసేన వర్సెస్ జనసేనగా మారిపోయిందని అంటున్నారు. ఒకటి ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యేతో కలిసుండే జనసేన గ్రూప్‌కాగా? రెండోది బాలినేని శ్రీనివాసరెడ్డి గ్రూప్‌గా విడిపోయినట్టు కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల కృషివల్లే తనకు ఒడా ఛైర్మన్ పదవి వచ్చిందని భావిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆహ్వానాలను కూడా ఆయన చెప్పినట్టే పంపారట. అందుకే సొంత పార్టీ నేత అయినా? బాలినేనికి కనీస పిలుపులు లేకపోగా? ఫ్లెక్సీల్లో ఎక్కడా ఆయన ఫోటో సైతం కనిపించలేదంటున్నారు. అలాగే బాలినేనితో కలివిడిగా ఉంటున్న జనసేన ఏకైక కార్పొరేటర్ ములగా రమేష్, ఆ పార్టీ మహిళా నేత రాయపాటి అరుణకు కూడా ఆహ్వానాలు వెళ్లలేదట. ఒంగోలులో భారీ కార్యక్రమాన్ని నిర్వహించినా? జనసేనలో ఓ వర్గం అంటూ తమను పక్కన పెట్టడంపై వాళ్ళు కూడా గట్టిగానే ఫైర్ అవుతున్నట్టు తెలిసింది. మరోవైపు అదేసభలో మాట్లాడిన టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బాలినేనిని మరోసారి టార్గెట్ చేసి మాట్లాడటం కూడా వివాదాస్పదం అవుతోంది. ఎన్నికల తర్వాత జనసేనలోకి వచ్చిన వారికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదన్నట్లుగా మాట్లాడారు దామచర్ల.

వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తులు కుల రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మాట్లాడటంపై కూడా చర్చించుకుంటున్నారట ఒంగోలులో. ఈ క్రమంలో? ఒంగోలు పరిణామాలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని భావిస్తున్నారట జనసేన నేతలు. ఇది పార్టీలో కూడా వర్గపోరుకు దారి తీస్తుందని, తీవ్రంగా డ్యామేజ్ జరుగుతుందని భావిస్తోంది ఒంగోలు జనసేనలోని ఓ వర్గం. అటు బాలినేని కూడా సెప్టెంబర్ మొదటి వారంలో పవన్ కళ్యాణ్ తో పాటు సీఎం చంద్రబాబును కూడా కలిసే అవకాశం ఉ దంటున్నారట. మొత్తంగా దీన్ని చూస్తుంటే ఒంగోలు కూటమిలో రచ్చ రంబోలా అయ్యేట్టే ఉందంటున్నారు పరిశీలకులు.

# వణికిస్తున్న విషజ్వరాలు!



**నిజామాబాద్, తెలంగాణ దిశ :** కామారెడ్డి జిల్లాలో డెంగ్యూ పంజా విసురుతుంది. మరోవైపు చిన్నారులకు సర్ది దగ్గు వైరల్ జరాలతో సతమతమవు తున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఉన్న సరిపడ మందులు కూడా అందుబాటులో ఉండడం లేదు. మరోవైపు వైద్య సేవలు కంటి తుడుపుచర్యలుగా చేపడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్లేట్ ప్లేట్లుతగ్గి ఆసుపత్రుల పాలవుతున్నారు. సరైనఅ వగాహన లేక వ్యాధి బారిన పడుతున్నారని వైద్యులు అంటున్నారు. ముందు జాగ్రత్త చర్యలుతీసుకుంటే వైరల్ పేవర్, డెంగ్యూ, గూనియా లాంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వాసుపత్రులకు వస్తున్న రోగులను కొందరు వైద్యులు ప్రైవేట్ క్లినిక్లు ఏర్పాటు చేసుకొని అక్కడికి రెఫర్ చేస్తున్నట్లు రోగుల ఆరోపిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ బారిన పడి రోగులు చికిత్స పొందుతుండగా మరి కొంతమంది రోగులు ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయానికి రావడంలేదని రోగు లు ఆరోపిస్తున్నారు.

వచ్చిన రోగులకు వైద్య సేవలను కంటి తుడుపు చర్యగా సేవలంది స్తున్నారని రోగులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ క్లినిక్ ఏర్పాటు చేసుకొని ఎక్కువ శ్రద్ధ ప్రైవేట్ ఆస్పత్రులపైనే వైద్యులు మొగ్గు చూపుతున్నారని రోగుల ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఓపి రోగులు 500 వరకు వస్తుండగా అడ్మిట్ మాత్రం 50 వరకు మాత్రమే రోగులు చేరుతున్నారు. మిగతా రోగులు ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్సలు పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రి లలో ప్రైవేటు పరీక్షలు చేయిస్తూ వేల రూపాయలు దండుకుంటున్నారు.

ఒక్కో పరీక్ష కు 50 శాతం డబ్బులు రేపర్ చేసిన వైద్యునికి మిగతా 50 శాతం డబ్బులు పరీక్ష కేంద్రం నిర్వాహకులకు పంచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన వైద్యాధికారులు పట్టించుకోకుండా నెలసరి మామూళ్లకు అలవాటు


పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం డెంగ్యూ, చికెన్ గున్యా, సర్ది ,దగ్గు, వైరల్ ఫీవర్లతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రిలో సైతం రోగులు కిటకిటలాడుతున్నారు. సీజనల్ వ్యాధులు అంటూ వైద్యులు చెప్తున్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ముందుకు సాగేనా..?




**నష్టాల ఊబిలో జయప్రకాశ్ ఏజెన్సీ..!**
**ఇప్పటివరకు పనుల ఆలస్యానికి ప్రధానకారణం అదే..**
**తాజాగా కంపెనీని టేకోవర్ చేసిన వేదాంత**
**అదీ తీవ్రమైన నష్టాల ఊబిలోనే..**

**శ్రీశైలం, తెలంగాణ దిశ :** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులు ప్రశ్నార్థకంగా మారాయి. ఒక వైపు ప్రభుత్వం 2027 కల్లా సొరంగం పనులను పూర్తి చేస్తామని ప్రగల్బాలు పలుకుతున్నా మరోవైపు క్షేత్రస్థాయి పరిస్థితులు ఆశాజనకంగా ఏమీ లేవు. పనులను చేపట్టిన జయప్రకాశ్ అసోసియేట్స్ కంపెనీ తీవ్ర నష్టాల్లో కూరుకుపోవడంతో సుదీర్ఘకాలంగా పనులు జాప్యానికి కారణమని తెలుస్తున్నది. తాజాగా ఆ కంపెనీని వేదాంత కంపెనీ కొనుగోలు చేసిసింది. అయితే అదీ తీవ్రమైన నష్టాల్లోనూ కొనసాగడం కొసమెరుపు. దీంతో పనుల కొనసాగింపు సాధ్యామా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఎస్ఎల్ బీసీ టన్నెల్ 44 కి.మీ పొడవు. దానిని రెండు వైపులా నుంచి టీబీఎం టెక్నాలజీతో చేపట్టేందుకు జయప్రకాశ్ కంపెనీ పనులను చేజిక్కిం చుకుంది. అమెరికాకు చెందిన రాబిన్స్‌సన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటివరకు కేవలం 34 కి.మీ టన్నెల్‌ను మాత్రమే పూర్తి చేసింది. ఇటీవలనే ఇన్‌లెట్ టన్నెల్‌లో సొరంగం పైకప్పు కూలిపోవడంతో పనులు నిలిచిపోయాయి. వాస్తవంగా 2005లో జయప్రకాశ్ ఏజెన్సీ ఎస్ఎల్‌బీసీ పనులను దక్కించుకుంది. అప్పటికీ కంపెనీ లాభాల్లోనే ఉన్నది. ఆదిలో పనులు సజావుగా కొనసాగాయి. టీబీఎంలు కొత్తవి కావడం, కంపెనీ సైతం లాభల్లో ఉండడంతో పనులు వడివడిగానే కొనసాగాయి. కానీ 2009 నాటికి జయప్రకాశ్ కంపెనీ నష్టాల్లోకి జారుకున్నది. ఇది మొదలు ఎస్ఎల్‌బీసీ పనులు మందకొడిగా సాగడం మొదలైంది. ప్రభుత్వం ఏజెన్సీకి డబ్బులు చెల్లించినా, జయప్రకాశ్ కంపెనీ తాను ఒప్పందం చేసుకున్న రాబిన్స్‌సన్స్ కంపెనీకి సకాలంలో చెల్లింపులను చేయలేదు. ప్రభుత్వం చెల్లించిన డబ్బులను ఎప్పటికప్పుడు నష్టాలను పూడ్చుకోవడానికి వినియోగించింది తప్ప పనుల నిర్వహణకు వినియోగించింది తక్కువ. దీంతో టన్నెల్ పనులు జాప్యానికి గరవుతూ వస్తున్నాయి. ఇప్పటికీ 9.6కిమీ టన్నెల్‌ను పూర్తిచేయాల్సి ఉంది. గత ఫిబ్రవరిలో ఎట్టకేలకు ఇన్‌లెట్ టన్నెల్ వైపు నుంచి పనులను ప్రారంభించింది. ప్రారంభించి న మూడు రోజులకే టన్నెల్ పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో 8మంది కార్మికులు సొరంగంలో గల్లంతయ్యారు. ఇప్పటికీ2 మృతదేహాలను మాత్రమే వెలికితీయగా, ఇప్పటికీ 6 కార్మికుల అచూకీ లభించలేదు. మరోవైపు టన్నెల్ తవ్వకం ఆగిపోయింది. ఇదిలా ఉంటే నష్టాల ఊబిలో కూరుకుపోయి, బ్యాంకు రుణాలను చెల్లించలేక జయప్రకాశ్ కంపెనీ దివాళా తీసింది. కంపెనీని అమ్మకానికి సిద్ధపడింది. అయితే ఈ క్రమంలో బిడ్లను ఆహ్వానించింది. రెండు ప్రధాన కంపెనీలు పోటీ పడ్డాయి. అదానీ గ్రూప్ రూ. 12000 కోట్లకు బిడ్‌ను దాఖలు చేసింది. అయితే వేదాంత కంపెనీ ఏకంగా రూ. 17000 కోట్లతో బిడ్ దాఖలు చేసింది. దీంతో జయప్రకాష్ కంపెనీని వేదాంతం స్వాధీనం చేసుకోవడం ఖరారైంది. అంతవరకు బాగానే ఉన్నా వేదాంత కంపెనీ సైతం నష్టాల్లోనూ ఉండడం ఇక్కడ కొసమెరుపు. వేదాంత కంపెనీ సైతం ఇటీవల రూ. 57,185 కోట్ల రుణాలను చెల్లించడంలో విఫలమైంది. తాజాగా ఆ కంపెనీనే జయప్రకాశ్ కంపెనీని కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే టన్నెల్ పనులపై అనుమానాలను రేకెత్తిస్తున్నది.



# అమెరికా విద్య ఎండమావేనా?

## తగ్గిన ఉపాధి అవకాశాలు.. పెరిగిన జీవన వ్యయం

### వీసా నిబంధనలతో అష్టకష్టాలు పడుతున్న భారతీయ విద్యార్థులు

న్యూయార్క్: అమెరికాలో విద్యాభ్యాసంఆపై ఉపాధి పొంది డాలర్లు సంపాదించాలన్న ఆశతో ఆ దేశానికి వెళ్తున్న మన విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ట్రంప్ ప్రభుత్వం విధించిన వీసా నిబంధనలతో కడుపు మాడ్చుకుంటూ రోజులు నెట్టుకొస్తున్నారు. వీసా నిబంధనల కారణంగా ఓవైపు ఉపాధి అవకాశాలు తగ్గిపోయి మరో వైపు జీవన వ్యయం పెరిగిపోవడంతో సర్దుబాటు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీసా నిబంధనలు ఉల్లంఘించారన్న నెపంతో ఇటీవలి కాలంలో 4,700 మంది భారతీయ విద్యార్థుల వీసాలను అమెరికన్ ప్రభుత్వం రద్దు చేసిందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనంలో పేర్కొంది. విద్యాలయాల్లో హాజరు శాతం తక్కువ కావడం, అనధికారికంగా ఉపాధి పొందడం వంటి కారణాలతో వీరి వీసాలు రద్దయినట్టు వెల్లడించించింది. ఇటీవల పలు రాష్ట్రాల్లో భారతీయ విద్యార్థులు పనిచేస్తున్న ప్రదేశాల్లో తనిఖీలు భారీగా పెరిగాయి. దీంతో తమ వద్ద పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్న విద్యార్థులను యజమానులు తొలగిస్తున్నారు. దీంతో తాము జీవన వ్యయాన్ని తగ్గించుకోవలసి వస్తున్నదని లేదా తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు.

ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నాలు: 'ఇంతకుముందు నేను ఓ రెస్టారెంట్‌లో రోజూ ఎనిమిది గంటలు పనిచేసి 1200 డాలర్లు సంపాదించేవాడిని. ఇటీవల తనిఖీలు అధికం కావడంతో మా యజమాని పని నుంచి తీసేశాడు. దీంతో నేను మరో రెస్టారెంట్ వెతుక్కున్నాను, కానీ అక్కడ నాకు రోజూ మూడు గంటలే పనిచేసేందుకు అనుమతిస్తున్నారు. దీంతో 400 డాలర్ల కన్నా తక్కువ వస్తున్నది. అవి నాకు సరుకులు కొనడానికి కూడా సరిపోవడం లేదు' అని లాస్‌ఏంజిల్స్‌లో ఓ సైబర్ సెక్యూరిటీ విద్యార్థి తెలిపాడు. ఈ ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది విద్యార్థులు ఖర్చులు తగ్గించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌లో ఆరుగురు విద్యార్థులం ఉంటున్నామని అట్లాంటాలో ఓ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి చెప్పాడు.

ఓపీటీపైనా ఆంక్షలు: అమెరికాలో ఉద్యోగ అనుభవం సంపాదించేందుకు ఉపయోగపడే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ)లో సైతం కొద్దిమందికే అవకాశాలు లభిస్తున్నాయి. అధికారిక నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి ఓపీటీలో భారతీయ విద్యార్థుల సంఖ్య 28శాతం తగ్గిపోయింది. 'అమెరికాకు రావడం నా భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించి ఇక్కడకు వచ్చాను. ఇక్కడికి వచ్చిన తరువాత చదువుపై దృష్టిని కేంద్రీకరించడానికి బదులు అద్దెలు, నిబంధనలపైనే నా ధ్యాస అంతా ఉంటున్నది. ఇప్పటికైనా పరిస్థితులు మెరుగుపడకపోతే ఇండియాకు వెళ్లిపోవడం తప్ప మరో మార్గం లేదు' అని అట్లాంటాలో పని దొరకక ఇబ్బంది పడుతున్న ఓ ఐటీ గ్రాడ్యుయేట్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అమెరికా వెళ్లాలనుకొనే విద్యార్థులు అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకోవాలని భారత్‌లోని కన్సల్టింగ్ ఏజెన్సీలు హెచ్చరిస్తున్నాయి.

విదేశాలకు భారత విద్యార్థుల నుంచి తగ్గిన ఆదాయం:
అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో అంతర్జాతీయ విద్యార్థి విధానాలు కఠినతరం కావడంతో భారతీయులు విదేశాల్లో చదువుకుంటున్న తమ పిల్లలకు పంపించే సొమ్ము తగ్గిపోయింది.

ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ క్రిందవిద్య కోసం మన దేశం నుంచి విదేశాలకు వెళ్లిన సొమ్ము రూ.10,229 కోట్లు అని భారతీయ రిజర్వు బ్యాంకు వెల్లడించింది. ఇది నిరుటి కన్నా 22 శాతం తక్కువ.




# సూపర్ టీచర్..

## వాళ్లు చెప్పే పాఠాలే కాదు..

# జీవిత పాఠాలూ విలువైనవే!

విద్యాబోధన అంటే సంవత్సరాల తరబడి మూస పద్ధతిలో సాగే క్రతువు కాదనీ, విద్యార్థుల్ని ఆకట్టుకుని పాఠం పట్టుబడేలా చేసే మార్గం అని నమ్మారు ఈ టీచరమ్మలంతా. అందుకే పాఠాలు చెప్ప డంలో తమకంటూ వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. ఆటలు, ఆటవిడుపు పర్యటనల ద్వారా అక్షరాన్ని చేరువ చేసే ప్రయత్నం ఒకరు చేస్తే, మనుషుల మధ్య మాటల్లా పాఠాలను మలిచి అందించా రు మరొకరు. సర్టిఫికెట్లు చేతికొచ్చాక ఉద్యోగానికి ఎదురుచూస్తున్న విద్యార్థులకు చేతినిండా పనిదొరికే మార్గాన్ని చూపారు ఇంకొకరు. అలా అని వీళ్లంతా అతి సులభంగా ఆ వృత్తిలోకేం రాలేదు. వైకల్యాల ను జయించిన వారు, చిన్ననాడే కుటుంబ బాధ్యతల్ని తలకెత్తుకున్న వారూ ఉన్నారిందులో. ఎన్నో ఒడుదొడుకులకు ఓర్చి మంచి టీచరమ్మలుగా పేరు తెచ్చుకున్న వీళ్లు చెప్పే పాఠాలే కాదు, వాళ్ల జీవిత పాఠాలూ విలువైనవే! ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ సూపర్ టీచరమ్మల విజయాలు తెలుసుకుందాం..

**వైకల్యాన్ని జయించిన సంకల్పం:** దివ్యాంగురాలినని ఆమె ఎన్నడూ దిగులు చెందలేదు. సంకల్ప బలంతో ముందుకు సాగి కోరుకున్న కొలువు సాధించింది. హిందీ అంటే గుబులెందుకంటూ విద్యార్థులకు ఆ భయాన్ని దూరం చేసింది హైదరాబాద్‌కు చెందిన దుర్గేష్ నందిని. విద్యార్థులకు వినూత్న రీతిలో హిందీని బోధిస్తూనే.. హిందీ సాహిత్యంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నది.

హైదరాబాద్‌కు చెందిన దుర్గేష్ నందిని అందరిలాగానే ఆరోగ్యంగా పుట్టింది. రెండేండ్లు వచ్చే వరకూ అపురూపంగా పెరిగింది. ఆ వయసులోనే టీకా వికటించి నందిని వైకల్యం బారినపడింది. ఆమె సోదరి కూడా టీకా బాధితురాలే! ఊహించని వైకల్యం ఆ అక్కాచెల్లెళ్ల జీవితాన్ని ఒక్కపూటలో మార్చేసింది.

నందిని తల్లి కుంగిపోయింది. కొన్నాళ్లకు తేరుకొని.. తన బిడ్డలను ఏ ఇబ్బందీ లేకుండా పెంచాలని నడుం బిగించింది. వృత్తిరీత్యా టీచర్ అయిన ఆమె.. తన పిల్లలకు ఇంట్లోనేపాఠాలు చెప్పేది. పరీక్షలు మాత్రంపాఠశాలలో రాసే ఏర్పాటు చేసింది. తల్లి ప్రోత్సా హంతో చదువుల్లో చక్కగా రాణిం చింది నందిని. వైకల్యాన్ని అధిగమిం చే సంకల్ప బలాన్నిపోగు చేసుకుంది. అంచెలంచె లుగా ఎదుగుతూ హిందీ భాషలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పట్టాను పొందింది. తన స్ఫూర్తిదాయక ప్రయాణం నాలుగు గోడల మధ్యనే నిలిచిపోకుండా పట్టుబట్టి టీచర్ కొలువుసాధించింది. 1994 డీఎస్సీలో ప్రభుత్వ పాఠశాల హిందీ టీచర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

**పుస్తకంతో పనేంటి..:** ప్రభుత్వ టీచర్‌గా హైదరాబాద్‌లోని స్కూల్లోనే తన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన దుర్గేష్ నందిని వినూత్న పద్ధతుల్లో విద్యాబోధనకు శ్రీకారం చుట్టింది. హిందీ పాఠం అంటే చాలామంది విద్యార్థులకు బెరుకు. ఏదో మార్కుల కోసం హిందీ పుస్తకం పట్టుకునే వాళ్లు తప్ప.. ఆ భాష నేర్చుకోవాలన్న తపన ఉండేది కాదు. నందిని హిందీ ఉపాధ్యాయురాలిగా బడిలో అడుగుపెట్టిన కొన్నాళ్లకే.. హిందీ పీరియడ్ ఎప్పుడెప్పుడా అని విద్యార్థులు ఎదురు చూసేవారు! అంత చక్కగా పాఠం బోధించేదామె. పుస్తకంలో సిలబస్ పూర్తి చేసి.. చేతులు దులుపుకోవడం నందినికి రాదు. ప్రతి దశలోనూ విద్యార్థులను ఇన్‌వాల్వ్ చేస్తూ పాఠ్యాంశం బోధించేది.

హిందీ మాటలు, పాటలు రాయిస్తూ.. ఆ భాషపై విద్యార్థుల్లో ఇష్టం ఏర్పడేలా చేసేది. పాఠాలను డ్రిల్లింగ్ చేయిస్తూ వినూత్నంగా నేర్పేది. దాంతో పిల్లల్లో నందిని టీచర్ మీద, ఆమె బోధించే హిందీ భాష మీదా ప్రత్యేక అభిమానం ఏర్పడింది. ఆమె ఏ బడికి వెళ్లినా.. ఇదే పద్ధతిని పాటిస్తూ వచ్చింది. భాష మీద పట్టు రావడం కోసం విద్యార్థులతో ఇంటర్వ్యూలు చేయించ డం, తమ ఆలోచనలను హిందీలో రాయమని చెప్పి ప్రోత్సహించడం లాంటివి చేసేది. విద్యార్థులు రాసిన కవితలను, బొమ్మలను పుస్తకం రూపంలో తెచ్చి.. వారిని సృజనశీలురుగా తీర్చిదిద్దింది.

**ఆ పుస్తకం ఎంతో ప్రత్యేకం..:** ఉపాధ్యాయురాలిగా తన వృత్తికి వంద శాతం న్యాయం చేస్తూనే.. రచనావ్యాసంగంలోనూ సత్తా చాటింది దుర్గేష్ నందిని. తన రచనలతో దివ్యాంగుల్లో ఆత్మైస్థైర్యం నింపాలని భావించింది. ఆమె ఆలోచనకు ఇంట్లోవాళ్లూ మద్దతుగా నిలిచారు. తనకిష్టమైన హిందీలోనే రచనలు గావించింది. తనకు ప్రాణప్రదమైన హిందీ భాషలో ఇప్పటివరకు 50కిపైగా పుస్తకాలు రాసింది నందిని. వాటిలో ఐదు పుస్తకాలను తానే పబ్లిష్ చేసింది. ఆమె రచనల్లో ఒకటైన స్వశక్త్ దివ్యాంగ్ పుస్తకం ఎంతో ప్రత్యేకమైనది. మన దేశవ్యాప్తంగా దివ్యాంగులైన 72 మంది విజేతల గెలుపు కథలను అందులో పొందుపరిచింది. ఈ పుస్తకానికి పార్లమెంట్ లైబ్రరీలో చోటు దక్కడం విశేషం. తాను చేస్తున్న హిందీ రచనలకు గాను పలు వరల్డ్ రికార్డులను కైవసం చేసుకుంది. హిందీ భాషలో విద్యార్థుల సామర్థ్యాల పెంపు కోసం నిరంతరం కృషి చేసిన దుర్గేష్ నందిని ప్రస్తుతం ఎస్‌సీఈఆర్‌టీలో సేవలు అందిస్తున్నది. ఎంపికైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హిందీ భాషలోని మెలకువల గురించి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నది. సాధించాలనే తపన ఉంటే.. వైకల్యం అడ్డు కాదంటారు నందిని. భవిష్యత్తులో విద్యార్థులతో హిందీ రచనలు చేయిం చి, వాటితో పుస్తకం తీసుకురావడమే తన లక్ష్యం అంటున్న ఈ టీచరమ్మను సూపర్ అనకుండా ఉండగలమా!

**యువత చూపు న్యాక్ వైపు మళ్లించిన టీచరమ్మ:** హన్మకొండకు చెందిన నక్క స్నేహలత.. సివిల్ ఇంజినీరింగ్ చేసింది. ఉద్యోగాల కోసం గాలిస్తున్న సమయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ఖాళీలున్నాయని తెలిసింది. ఆలస్యం చేయకుండా అందులో చేరింది. నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడం న్యాక్ బాధ్యతల్లో ఒకటి. 2007లో ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాక్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లోకి చేరిన స్నేహలత.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి మండల కేంద్రాన్ని తట్టిలేపింది. ములుగు వంటి గ్రామీణ ప్రాంతాలకు సైతం వెళ్లి అక్కడున్న యువతకు న్యాక్ అంటే ఏమిటో తెలియజేసింది. న్యాక్‌తో మాకేంటి అన్నవాళ్లే.. తర్వాత ఆమె పర్యవే క్షణలో శిక్షణ తీసుకొని.. ఉపాధి అవకాశాలు సొంతం చేసుకున్నారు. యేటా మూడు బ్యాచ్‌ల చొప్పున ఇప్పటివరకు 500కు పైగా బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చింది స్నేహలత. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 10,000 మందికిపైగా తర్ఫీదునిచ్చి ధ్రువపత్రాలు అందించింది. స్నేహలత న్యాక్ ట్రైనింగ్ అందరికంటే కాస్త విభిన్నంగా ఉంటుంది. గ్రామీణ నేపథ్యం కలిగిన వారికి శిక్షణనిచ్చే సమయంలో వారి నేపథ్యం తెలుసుకుంటుందామె! అభ్యర్థుల ఆసక్తిని దృష్టిలో ఉ ంచుకొని ట్రైనింగ్ ఇస్తుంది. న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ ప్రోత్సాహంతో




విరివిగా శిక్షణ శిబిరాలు నిర్వహించింది. తనదైన శైలిలో న్యాక్ బోధన చేసినందుకు గాను ఈ ఏడాది మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ విభాగంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారానికి ఎంపికైంది స్నేహలత. రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనుంది. ప్రస్తుతం హుజురాబాద్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న స్నేహలత ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని చెబుతున్నది. న్యాక్ సేవలను నలుమూలలకు చాటి, యువతకు చక్కటి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పనిచేయ డమే తన లక్ష్యమని తెలుపుతున్నది.

**వినూత్న విద్యనే ఆమె చిరునామా..:** జాతీయ స్థాయిలో ఉత్తమ ఉ పాధ్యాయురాలిగా ఎంపికైన మారం పవిత్రకు చదువంటే ఎంతో ఇష్టం. మిర్యాలగూడ దగ్గర్లోని తడకమల్ల ఆమె సొంతూరు. ఆమె నాలుగో తరగతి చదువుతున్నప్పుడే తండ్రిని కోల్పోయింది. తల్లి రెక్కల కష్టం మీద ఆ కుటుంబం నడిచింది. సోదరితో కలిసి డిగ్రీ వరకు చదువుకుంది. తన చదువు కొనసాగించడానికి ఒప్పుకొంటేనే పెండ్లికి అంగీకరిస్తానని చెప్పింది. అప్పటికే ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆ అబ్బాయి ఆమె ఇష్టాన్ని గౌరవించాడు. పెండ్లి తర్వాత పవిత్ర బి.ఎడ్, ఎం.ఎడ్ పూర్తి చేసింది. భర్త ప్రోత్సాహంతో డీఎస్సీకి సిద్ధమై.. 2009లో ప్రభుత్వ టీచర్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ప్రస్తుతం ఆమె సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్నది. విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థం చేయడానికి రోల్ ప్లే, బోర్డ్ గేమ్స్, కార్డ్ గేమ్స్, క్షేత్రస్థాయి పర్యటనలు చేయిస్తుంటుంది పవిత్ర. స్కూల్‌కే పరిమితమైన విద్యార్థులను హైదరాబాద్‌లోని సీసీఎంబీ, శ్రీహరికోట లోని ఇస్రోకు స్వయంగా తీసుకెళ్లి.. పిల్లల్లో విజ్ఞానాన్ని నింపే ప్రయత్నాలు చేసింది. మరోవైపు ఓపెన్ స్కూల్ విద్యార్థులకోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలను రాయడం, టీశాట్ పాఠాల కోసం కంటెంట్ ఇవ్వడం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,9 తరగతుల విద్యార్థుల కోసం వర్క్‌షీట్స్ తయారు చేయడం ఇలా ఎన్నో సేవలు అందిస్తున్నది. దీక్ష పోర్టల్‌లో ఇప్పటివరకు 99 వీడియో పాఠాలను అప్‌లోడ్ చేసింది. విద్యారంగంలో పవిత్ర చేస్తున్న కృషికి గాను 2021లో సారాభాయ్ టీచర్ సైంటిస్ట్ జాతీయ పురస్కారానికి ఎంపికైంది. ప్రస్తుతం ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎన్నికై రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్నది. మన జీవితంతో ముడిపడిన సైన్స్‌ను విద్యార్థులు అర్థం చేసుకొని ఆచరించేలా చేయడమే తన బాధ్యత అంటున్నది ఈ టీచరమ్మ.

# మిమిక్రీ మహా 'రాజ్ కుమార్'

## -పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు గాను హైద్రాబాద్ లో ఘన సన్మానం..

**మంథని,తెలంగాణ దిశ :** మందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న సుంకనపల్లి రాజ్ కుమార్ ను హైదరాబాదులో ఘనంగా సన్మానించారు. రాజ్ కుమార్ మిమిక్రి కళాకారుడిగా,సినీ టీవి నటుడిగా తెలుగు సినిమా పరిశ్రమలో కృషి చేశారు. రాజ్ కుమార్ కళారంగానికి చేసిన సేవల కు గాను ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరిం చుకొని జరిగిన కార్యక్రమంలో ఘన సన్మానం పొందారు. మిమిక్రి కళా నైపుణ్యం పై లోతైన పరిశోధన గ్రంథం "ధ్వన్యనుక రణ శాస్త్రం" రచించి తన గురువు డా.నేరేళ్ల వేణుమాధవ్ కి కాకతీయ విశ్వ విద్యాలయంలో అంకితం ఇచ్చారు. మిమిక్రి కళాకారుడు,పద్మశ్రీ డా.నేరేళ్ల వేణుమాధవ్ దగ్గర శిష్యరికం చేశారు. కీ.శే. దేవదాస్ కనకాల,కీ.శే. లక్ష్మీ కనకాల దంపతుల వద్ద నటన నేర్చుకున్నారు. తమ మొదటి మిమిక్రి ప్రదర్శన ను 1982లో కొత్త ఒరువడితో "నవ్వుల రాజ్ కుమార్" గా పేరు పొందారు. ఆకాశవాణి వరంగల్ రేడియోలో క్యాజువల్ కాంపియర్ గా పని చేస్తూ,1993 నుంచి 2006 వరకు "సావటి ముచ్చట్లు" ద్వారా 'రాజయ్య మామ'గా గుర్తింపు పొందారు. దూరదర్శన్,ఈటీవి పలు టీవిలలో "నవ్వుల రకాలు" ప్రదర్శనలు ఇచ్చారు. కీ.శే. నటులు,దర్శకులు దేవదాస్ కనకాల,లక్ష్మీ కనకాల ఆధ్వర్యంలో 'ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ లో నటన శిక్షణ 1986 నుంచి 1988 వరకు నేర్చుకున్నారు. కీ.శే.దేవదాస్ కనకాల దర్శకత్వంలో రూపొందిన టివి సీరియల్స్ మరియు టివి షోస్ లలో ప్రసారమైన 'రాజి బుజ్జి,జాతక కథలు,మనసు గుర్రం లేదు కళ్లెం,మీరు ఆలోచించండి' అనేవాటిలో నటించారు. దూరదర్శన్ ధారావాహిక "ఋతురాగాలు" టివి సీరియల్లో పనివాడి పాత్ర అయిన 'మూర్తి'గా నటించారు. పద్మశ్రీ డా.నేరేళ్ల వేణుమాధవ్ ఏర్పాటు చేసిన పొట్టిశ్రీరాములు విశ్వ విద్యాలయంలో 'డిప్లమా ఇన్ మిమిక్రి' కోర్సుకు అధ్యాపకుడిగా 1997 నుంచి 2001 వరకు సేవలు అందించారు. 2002 నుంచి 2006 వరకు కాకతీయ విశ్వ విద్యాలయంలో దూరవిద్య 'డిప్లమా ఇన్ మిమిక్రి' కోర్స్ కి కో-ఆర్డినేటర్ గా పని చేశారు. కాకతీయ విశ్వ విద్యాలయం దూరవిద్యలో విద్యార్థులకు 'మిమిక్రి' కోర్స్ ఆంగ్లంలో "ద సైన్స్ ఆఫ్ మిమిక్రి" పుస్తకాన్ని తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువాదం చేశారు. అప్పటి తెలంగాణ ఉప ముఖ్యమం త్రికడియం శ్రీహరి చేతుల మీదుగా ఆ గ్రంథాన్ని ఆవిష్కరించారు. కీ.శే.జంధ్యాల దర్శకత్వంలో "విచిత్రం" సినిమాలో ఎం.ఎస్.నారాయణ గారితో మిమిక్రి వేషం చేశారు.

# మణిపూర్‌లో తెరుచుకున్న జాతీయ రహదారి

న్యూఢిల్లీ: మణిపూర్‌లో రెండో నంబరు జాతీయ రహదారి తెరుచు కుంది. బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం రాజేసిన తెగల మధ్య ఘర్షణల కారణంగా ఈ రహదారిపై రాకపోకలు నిలిచి పోయిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వానికి, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వానికి, కుకి-జో గ్రూపులకు మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. మణిపూర్ ప్రాదేశిక సమగ్రతను రక్షించడం, జాతీయ రహదారి-2లో అడ్డంకులు లేకుండా చూడటం స్వేచ్ఛగా వినియోగి ంచడం, సాయుధుల శిబిరాలను తొలగించడం ఈ ఒప్పందంలోని ముఖ్యాంశాలు. న్యూఢిల్లీలో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో కుకి నేషనల్ ఆర్గనైజేషన్(కెఎన్‌ఒ), యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్ (యుపిఎఫ్) ప్రతినిధులు, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, మణిపూర్ ప్రభుత్వ ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇది ఏడాది పాటు అమల్లో ఉంటుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. కెఎన్‌ఒ, యుపిఎఫ్ తమ శిబిరాలను తరలించడానికి, ఆయుధాలను అప్పగించడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు ప్రయాణీకులు, నిత్యావసర వస్తువుల రవాణా కోసం జాతీయ రహదారి-2ను తెరవాలని కుకి-జో కౌన్సిల్ (కెజెడ్‌సి) గురువారం నిర్ణయం తీసుకుంది. న్యూఢిల్లీలో కేంద్రహోం మంత్రిత్వ శాఖ అధికారులు, కెజెడ్‌సి మధ్య వరుస సమావేశాల తరువాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌హెచ్-2లో శాంతిని నెలకొల్పడానికి భారత భద్రతా దళాలకు సహకరిస్తామని కెజెడ్‌సి వెల్లడించింది.



# రాత్రికి రాత్రే సమాధుల మయం..!?

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాల కోసం కొంతమంది ఎంతటి దారుణ చర్యలకు వెళ్తారో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. స్థానికంగా ఒక కుటుంబానికి చెందిన ఆరు సమాధులను రాత్రికి రాత్రే మాయం చేసిన ఘటన వెలుగులోకి రావడంతో గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదట ఆ భూమి యజమానులు తమ పొలంలోని ఒక భాగాన్ని శంకరయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి విక్రయించారు. అయితే ఆ స్థలంలో పెద్దల సమాధులు ఉండటంతో ఆ చిన్నభాగాన్ని అమ్మకుండా మినహాయించారు. తరువాత శంకరయ్య ఆ భూమిని రవి అనే మరో వ్యాపారికి అమ్మేశాడు. కానీ సమాధులు తాను కొన్న స్థలంలో అడ్డుగా ఉన్నాయన్న కారణంతో.. రాత్రివేళల్లో ఆ సమాధులను తవ్వించి నిర్మాణాల ఆనవాళ్లను తొలగించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, సమాధులలోని హస్తికలను సైతం ఎత్తుకుపోయారని బాధితులు చెబుతున్నారు. దాదాపు 24 ఏళ్లుగా తమ కుటుంబానికి చెందిన పూర్వీకుల సమాధులు ఇక్కడే ఉన్నాయని బాధితులు తెలిపారు. అలాంటి పవిత్ర స్థలాన్ని ధ్వంసం చేయడం మానవీయ విలువలకు విరుద్ధమని.. ఆ చర్యతో తాము తీవ్ర మనోవేద నకు గురయ్యామని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ భూమిని తిరిగి అప్పగించాల్సిందిగా.. అలాగే ఈ దారుణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై గ్రామ ప్రజలు కూడా స్పందించారు. సమాధులు కేవలం మట్టి గుట్టలు కాదు, అవి మన పూర్వీకుల జ్ఞాపకాలు.. మన చరిత్రలో భాగం" అని స్థానికులు పేర్కొన్నారు. లాభాల కోసం పితృదేవతల సమాధులను ధ్వంసం చేయడం నేరమే కాకుండా సమాజాన్ని కలవరపరిచే చర్య అని వారు అభిప్రాయపడ్డారురియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. ఆ రంగంలో నియంత్రణ లేకపోతే ఇలాంటి అనైతిక ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలు భూముల పర్యవేక్షణను కఠినతరం చేసి.. పూర్వీకుల సమాధులను పరిరక్షించే చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి గ్రామంలో ఇలాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే అధికారులు వెంటనే చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, సమాజంలో శాంతి భద్రతలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నైతిక విలువలు పక్కనబెడితే, సమాజం మొత్తానికి ఇది ముప్పుగా మారే అవకాశం ఉంది. మహేశ్వరం ఘటన అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది.

## ఆరెల్లి కిరణ్ గౌడ్ దంపతులను సన్మానించిన యువ గజానన మండలి సభ్యులు

**మంథని,తెలంగాణ దిశ:** మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో నెలకొల్పిన వినాయక మండపంలో నవరాత్రులలో యువ గజానన మండలి కమిటీ సభ్యులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించినందుకు గాను, భక్తాంజనేయ స్వామి దేవాలయానికి సౌండ్ బాక్స్ డోనేట్ చేసినందుకు గాను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జ్,మాజీ వార్డు సభ్యుడు ఆరెల్లి లావణ్య కిరణ్ గౌడ్ దంపతులను కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు శు క్రవారం రాత్రి శాలువతో ఘనంగా సన్మానం చేశారు.




# గ్రేటర్ లో 11 లక్షల మందికి చీరలు



**హైదరాబాద్, తెలంగాణ దిశ:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దసరా, బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కనీవినీఎరుగని రీతిలో ఈ సంవత్సరం బతుకమ్మ వేడుకలు నిర్వహిం చేందుకు రెడీ అవుతోంది. మూడు రోజులు పాటు కార్నివాల్ తర హాలో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం రెడీ అయ్యిం ది. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా నగరంలోని 11లక్షల మందికి బతుకమ్మ కానుక ఇవ్వనుం ది..గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కరు, ఇద్దరు కాదు ఏకంగా 11 లక్షల మందికి దసరా పండుగ కానుక ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఆడపడుచులకు దసరా పండుగ కానుకతో పాటుగా.. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సష్టించేలా కా ర్యక్రమాలు రూపొందిస్తుంది. ఇంతకు జీహెచ్ఎంసీ ఏం చేయబోతుంది అంటే..ఈ సంవత్సరం నిర్వహించబోయే బతుకమ్మ ఉత్సవాలను గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేస్తోందిఈ సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిం చేందుకు జీహెచ్ఎంసీ రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఏకంగా 11లక్షల మందితో బతుకమ్మ సంబురాలు నిర్వహించబో తుంది. అలానే వీరందరికి బతుకమ్మ చీరలను కూడా పంపిణీ చేయన ున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 11 లక్షల మంది స్వయం సహాయక సభ్యులకు పంపిణీ చేయడం కోసం సర్కార్ 11 లక్షల బతుకమ్మ చీరలను కేటాయించనుంది. బతు కమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కోసం సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లను ఇన్‌ఛార్జులుగా నియమించబో తున్నారని తెలుస్తోంది. ఇప్పటి వరకు కేరళలో నిర్వహించే ఓనం పండుగ మాత్రమే ఇలాంటి రికార్డు క్రియేట్ చేయగా.. ఈసారి బతుకమ్మ ఉత్సవాలతో ఆ రికార్డును బ్రేక్ చేసేందుకు జీహెచ్ఎంసీ రెడీ అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నుంచి బతుకమ్మ ఉత్సవాలు, నవరాత్రులు మొదలవుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో సెప్టెంబర్ 27న సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్నివాల్ ఉత్సవాలు నిర్వహించబోతున్నారు. ఆ మరుసటి రోజు అనగా సెప్టెంబర్ 28న ఎల్బీ స్టేడియంలో బతుకమ్మ గిన్నిస్ వ రల్డ్ రికార్డు కార్యక్రమం నిర్వహిస్తారు. 11లక్షల మంది ఈ వేడుకలో పాల్గొంటారు.

ఆ తర్వాత సెప్టెంబర్ 29న పీపుల్స్ ప్లాజా వద్ద ఉత్తమ బతుకమ్మ పో టీలు నిర్వహించబోతున్నారు. అలానే సెప్టెంబర్ 30వ తేదీన ట్యాంక్‌బండ్ వద్ద అంగరంగ వైభవంగా పూల పండుగ నిర్వహించ నున్నారు. బతుకమ్మ వేడుకల నేపథ్యంలో నగరంలోని సుమారు 30 సర్కిళ్ల నుంచి మహిళలను శిల్పకళా వేదిక వద్దకు తరలించేందుకు గాను.. 150 బస్సులను వినియోగించబోతున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు._ స్పెషల్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలానే రాష్ట్రంలోని పలు చేతివృత్తుల వారు తయారు చేసిన కళాఖ ండాలు, ఇతర ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించడమే కాక విక్రయించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు నెక్లెస్ రోడ్డులో మూడు రోజుల పాటు.. తెలంగాణ వంటకాలతో స్పెషల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు అధికారులు ప్లాన్ చేస్తున్నారు.

# నేత్రదానంతో కొత్త చూపు



## సెప్టెంబర్ 8 వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

ఒక మనిషి మరణించినా మరొకరి ద్వారా లోకాన్ని చూడొచ్చు. ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించొచ్చు. జీవితం చీకటిమయంగా మారిందని బాధపడేవారి జీవితాల్లో వెలుగులు నింపొచ్చు. ఈ అవకాశం ఒక్క నేత్రదానంతోనే సాధ్యమవుతుంది. అందుకే సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు పెద్దలు. కళ్లకు ఉన్న ప్రాధాన్యం అమూల్యం. నేత్రదానంతో పలువురు జీవితాల్లో వెలుగులు నింపొచ్చు.

ఒకరి నేత్రదానం. ఇద్దరికి చూపునిస్తుంది. దేశంలో ఏటా 20 వేలమంది అంధత్వానికి లోనవుతున్నారు. విటమిన్-ఏ లోపం, కంటి గాయాలు, కంటి వ్యాధులు ఇందుకు కారణం. కార్నియా మార్పిడి ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. రాష్ట్ర జనాభాలో దాదాపు 5 నుంచి 6 శాతం మంది అంధత్వ లోపంతో బాధపడుతున్న వారు ఉన్నారని నివారణ సంస్థ సర్వే చెబుతోంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు కొనసాగనున్నాయి. దీనిపై ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ అంగీకరించేలా చొరవ తీసుకోవడంతో పాటు అంధత్వ లోపాన్ని అధిగమించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రస్థాయిలో అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు అవగాహనా కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నాయి. సదస్సుల్లో అంగీకారం మేరకు పత్రాలను తీసుకుంటున్నారు. సహజ మరణం, దీర్ఘకాలిక వ్యాధులతో మృతి చెందిన వారి నేత్రాలను దానం చేయొచ్చు. ఏ వయసు వారి కళ్లయినా ఇవ్వొచ్చు. క్యాన్సర్, హెచ్ఐవీ, కామెర్లు, పిచ్చి కుక్కకాటుతో మృత్యువాత పడిన వారి నేత్రాలను సేకరించరు. నేత్రదానం చేయాలనుకునే వారు ఆయా జిల్లాల్లోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయాల్లో అంగీకారపత్రాలను అందజేయాలి. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులు మినహాయించి మిగతా ఎలాంటి కారణంతో చనిపోయినా నేత్రాలను దానం చేయొచ్చని సంబంధిత వైద్య నిపుణులు చెబుతున్నారు. మరణించినా చూపు బతుకుతుందని, ఇద్దరు వ్యక్తులు అంధత్వ లోపం నుంచి బయటపడతారంటున్నారు.

మూఢ నమ్మకాలు కారణమే!: రాష్ట్రప్రభుత్వంతోపాటుగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ప్రతినిత్యం దీనికి సంబంధించిన అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా చాలామంది ముందుకు రావడం లేదు. ఎందుకంటే కొన్ని మూఢనమ్మకాల కారణంగా ఇది జరుగుతోంది. నేత్రదానం చేస్తే చెడు జరుగుతుందనే ప్రచారాలు కూడా ఉన్నాయి. అందుకనే ఎక్కువమంది ముందుకు రావటం లేదు. ప్రమాదాలు, అనారోగ్య సమస్యలతో భారీగా మరణిస్తున్నా నేత్రదానాలు చేసింది అంతంత మాత్రమే అని అంధత్వ నియంత్రణ సంస్థ చెబుతోంది. చాలా కుటుంబాల్లో నేత్రదానం చేయాలని ఉన్నా సమయానికి ఎవరిని సంప్రదించాలో తెలియక వదిలేస్తున్నారు. వీటి కోసం ఎదురుచూస్తున్న బాధితులకు ఆలస్య మవుతోంది. దానంపై అంగీకారపత్రాన్ని జిల్లాలోని ఏ ఆరోగ్య కేంద్రంలోనైనా ఇవ్వొచ్చని నియంత్రణ సంస్థ అధికారులు చెబుతున్నారు. మరణించిన వ్యక్తుల బంధువులు వెంటనే స్థానిక ఆసుపత్రి, స్వచ్ఛంద సంస్థలైన లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు సమాచారం ఇస్తే నేరుగా వచ్చి సేకరిస్తారని సూచిస్తున్నారు.

అవగాహన ముఖ్యం: నేత్రదానం ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. మరణించిన ఆరు గంటల్లోగా మృతుల కంటి నుంచి కార్నియాను తీయాలి. దీనిపై సమీప ఆసుపత్రి వైద్యులకు సమాచారాన్ని తెలియజేసేలా ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్నియా పొరలు దెబ్బతిని కంటి చూపులేనివారు ఎంతో మంది ఉన్నారు.

వారికి చూపు రావాలంటే మరణానంతరం ఎవరైనా కార్నియాలను దానం చేయాలి. అలా చేస్తే వారిలో 75 శాతం మందికి కళ్లు కనిపించే అవకాశం ఉంటుంది. పోషకాహార లోపం, ఇన్ఫెక్షన్లు, రసాయనాలు దగ్ధమైన పొగ, పుట్టుకతో వచ్చిన లోపాలు, ప్రమాదాల కారణంగా కంట్లోని నల్లగుడ్డుపై పొర దెబ్బతినడం.. ఇలాంటి సమస్యలతో బాధపడేవారికి నేత్రదానం ద్వారా కార్నియా పొరలు సేకరించి శస్త్రచికిత్స చేస్తే చూపు వస్తుంది.

ముందుకు రావాలి: నేత్రదానానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. దీనిపై అవగాహన లేకపోవడంతో అవకాశం ఉన్నా ఎంతో మంది చూపులేకుండానే ఉండిపోతున్నారు. నేత్రదాన అంగీకార పత్రం ఇచ్చినవారు వారి కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా విషయాన్ని తెలియ జేయాలి. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌పిసిబి నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైన్డ్‌నెస్, నేత్రదానం గురించి ప్రజలందరూ, ముఖ్యంగా యువత తెలుసుకొని నల్ల గుడు (కార్నియా ). బ్లైండ్ నెస్ తీవ్రత తెలుసుకొని ప్రజల్లోకి నేత్రదాన అవగాహన తీసుకెళ్తే చాలా బాగుంటుంది.

నేత్రదానం ఎలా చేయాలి..: స్వచ్ఛంద సంస్థలు గాని దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో గానీ, నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలు అందుబాటులో ఉంటాయి. పూర్తి చేసి కుటుంబ సభ్యుల సంతకాలు చేయించి సంబంధిత అధికారులకు అందజేయాలి. మరణానంతరం మన కళ్ళను ప్రభుత్వ నేత్ర వైద్య నిపుణులు సేకరించి కావాల్సిన వాళ్లకు అమరుస్తారు. నేత్రదాన అంగీకార పత్రం ఇచ్చిన వ్యక్తి మరణించి వెంటనే అక్కడ ఉన్న ఫ్యాన్లు ఏసీలు ఆఫ్ చేయాలి. చనిపోయిన వ్యక్తి తల కింద ఎత్తైన తలగడ ఉంచాలి. నీళ్లలో తడిపిన దూదిని రెండు కళ్ళ పైన ఉంచాలి. దగ్గరలో, అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య శాలకు లేదా నేత్రదానం సంబంధించిన స్వచ్ఛంద సంస్థలకు సమా చారం అందించాలి. ఒక వ్యక్తి మరణించిన తర్వాత 4 గంటల్లోపు అతని కార్నియా పొరను శస్త్రచికిత్స ద్వారా సేకరించి సక్రమంగా భద్రపరిస్తే ఇతరులకు చూపు ప్రసాదించవచ్చు. నేత్రదానానికి ఎవరైనా వాగ్దానపత్రం ఇచ్చినా వారి సమీప బంధువు ఆమోదం కూడా అవసరం అవుతుంది.

ఎలా దరఖాస్తు చేయాలంటే: నేత్రాలు దానం చేయాలనుకొనే వారు దరఖాస్తు పత్రాన్ని భర్తీ చేసి ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయాల్లో అందజేయాలి. 18 సంవత్సరాల వయసు నిండిన వారి నుంచి మాత్రమే దాన పత్రం స్వీకరిస్తారు. మృతి చెందిన వ్యక్తి నుంచి ఆరు గంటలలోపు కార్నియాను సేకరించి సక్రమంగా భద్రపరిస్తే ఇతరులకు చూపు ప్రసాదించొచ్చు. 18 ఏళ్లు నిండినవారు.. సహజ మరణం పొందినవారు, ప్రమాదవశాత్తూ మృతిచెందిన ఆరోగ్యవంతులు దానం చేయొచ్చు. మధుమేహం, రక్తపోటు ఉన్నా.. గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులతో చనిపోయినా.. ఎవరివైనా నేత్రాలు దానం చేయొచ్చు.

క్యాన్సర్, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, నల్లగుడ్డు దెబ్బతిన్న వారు, కామెర్లు, పిచ్చికుక్క కాటుతో మృతిచెందినవారు దానం చేయడానికి అనర్హులు. నేత్రదానం 15-20 నిమిషాల్లో పూర్తయ్యే సాధారణ ప్రక్రియ. దాత మృతిచెందిన ఆరు గంటల్లోపు కార్నియాలు తీయాలి. అంధులకు కార్నియాను మాత్రమే అమరుస్తారు.

మొత్తం కంటిని కాదు. నేత్రదానానికి ఎవరైనా అంగీకార పత్రం ఇచ్చినా వారి కుటుంబ సభ్యుల ఆమోదం కూడా అవసరం. నేత్రదానం చేయాలనుకునేవారు దరఖాస్తు పత్రాన్ని నింపి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయాల్లో అందజేయాలి. 18 ఏళ్లు నిండిన వారినుంచి మాత్రమే పత్రం స్వీకరిస్తారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

### కబడ్డీ క్రీడోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్,తెలంగాణ దిశ :** ప్రస్తుత కాలంలో విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సుడా చైర్మన్ కోమడిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ అర్బన్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అర్బన్ కబడ్డీ పోటీలను ఆయన లాంచనంగా ప్రారంబించారు. అంతకుముందు ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. నూతన క్రీడా పాలసీతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుండడం గర్వకారణమన్నారు. జిల్లాలో మానేరు విద్యాసంస్థలు క్రీడారంగాని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర పోటీలు జరుగడం ఆనందించదగ్గ విషయమన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ పోటిల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. సుడా పరంగా జిల్లాలో క్రీడారంగ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మానేరు విద్యాసంస్థల ఆధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు సముచిత స్థానాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణించిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు.

# దానం.... ఇక నిదానం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిపై అనర్హత కత్తి వేళ్లాడుతుంది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. స్పీకర్ కూడా దీనిపై స్పందిస్తూ పార్టీని ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇస్తామని తెలిపారు. దీనిపై వారితో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అయితే ఇప్పుడు పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలలో తొమ్మిది మంది పరిస్థితి వేరు. ఒక్కరి పరిస్థితి వేరుగా ఉంది. అందులో ముఖ్యంగా ఒకరికి మాత్రం అనర్హత వేటు పడే అవకాశం ఎక్కువగా ఉందని న్యాయనిపుణులు కూడా చెబుతున్నారు. అందుకే అందిరి వేళ్లూ ఆయన వైపు చూపుతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో... 2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలిచిన వారిలో మొత్తం పది మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అప్పటి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి సమక్షంలో పార్టీ కండువాను కూడా కప్పుకున్నారు. వీరంతా కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరకపోయినా వారికి మద్దతుదారుగా నిలిచారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లంవెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే ఎం. సంజయ్ కుమార్, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ లు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరారు... అయితే ఈ పది మందిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిస్థితి మాత్రం అనర్హత విషయంలో ఒకింత సీరియస్ గానే కనపడుతుంది. ఎం దుకంటే మిగిలిన ఎమ్మెల్యే లందరూ కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పార్టీ కండువాను మాత్రమే కప్పుకున్నారు. అది పక్కన పెడితే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాత్రం బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి 2024 లోజరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

# రెచ్చిపోతున్న సింహపురి గ్యాంగ్ లు..?

**నెల్లూరు, తెలంగాణ దిశ :** నెల్లూరు ఒకప్పుడు ప్రశాంతంగా ఉండేది. పచ్చని పొలా లు.. పెన్నా నీటితో పండే ధాన్యపు సిరులతో కళకళలాడేది. అలాంటి నెల్లూరు ఇటీవల కాలంలో రౌడీషీటర్లకు నిలయంగా మారింది. నెల్లూరు కంటే పొరుగున ఉన్న ఒంగోలులో రౌడీషీటర్లు 1980వ దశకంలో ఎక్కువగా ఉండేవారు. సుపారీ గ్యాంగ్ లు కూడా ఒంగోలు లో ఎక్కువగా ఉండేవి. హత్యలు, అత్యాచారాలు ఎక్కువగా ఒంగోలు ప్రాంతంలోనే జరిగేవి. కానీ మారుతున్న కాలక్రమంలో ఇప్పుడు ఆ జబ్బు ఒంగోలు నుంచి పక్కనే ఉన్న నె ల్లూరుకు అంటుకున్నట్లే కనిపిస్తుంది. నెల్లూరులో రౌడీషీటర్లు ఎక్కువగా కనిపిస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లోనూ సుపారీ గ్యాంగ్ లుగా నెల్లూరోళ్లనే ఎంచుకుంటున్నారు. ఒంగోలు కొద్దిగా శాంతి భద్రతల విషయంలో సరైన దారిలో పయనిస్తుండగా నెల్లూరు మాత్రం గాడి తప్పిందన్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

చెన్నైకి సమీపంలో ఉన్న నెల్లూరులో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడే వారు ఎక్కువ. అలాగే బంగారు వ్యాపారులు కూడా అధికమే. అనేక మంది కళాకారులకు కూడా నాడు నెల్లూరు నిలయంగా ఉండేది. దివంగత ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం అక్కడ జన్మించి తన పాటలతో దేశాన్ని ఉర్రూతలూగించారు. ఇక సినిమా నటులకు కూడా నెల్లూరులో కొరతలేదు. చెన్నై పక్కనే ఉండటంతో ఉపాధి కోసం కూడా యువత ఎక్కువగా అక్కడకు వెళ్లి కష్టపడి పనిచేసుకుంటూ జీవనం సాగించే వారు. కానీ నెల్లూరు లో నేడు రౌడీ గ్యాంగ్ లు పెరిగిపోయాయి. రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ రౌడీషీటర్లు చెలరేగిపోతున్నారంటున్నారు. ఇటీవల నెల్లూరు సుపారీ గ్యాంగ్ ఒంగోలులో తెలుగుదేశం పార్టీ నేత వీరయ్య చౌదరి హత్యలోనూ నెల్లూరు గ్యాంగ్ ప్రమేయం ఉందని అందరికీ తెలిసిందే. అలాగే మలక్ పేట్ లో జరిగిన చందు రాథోడ్ హత్య కేసులో కూడా నెల్లూరోళ్ల ప్రమేయం ఉందని పోలీసులు అనుమానించారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ హత్యలు జరిగినా నెల్లూరు రౌడీ షీటర్ల ప్రమేయం ఉండటం కొంత ఆందోళన కలిగిస్తుంది. అక్కడ శాంతిభద్రతల వైఫల్యంతో పాటు రాజకీయ నాయకుల వైఖరి గతంలో కంటే మార్పు కారణ మన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఇటీవల రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణల వ్యవహారం కూడా నెల్లూరులో కలకలంరేపింది. ఈ ఇద్దరి వెనక రాజకీయ నేతలు, పోలీసు అధికా రుల ప్రమేయం ఉందన్న విషయమూ గుర్తించారు. శ్రీకాంత్ పెరోల్ విషయమూ వివాదంగా మారిన నేపథ్యంలో తాజాగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ని హతమారిస్తే డబ్బులే డబ్బులంటూ రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో వైరల్ గా మారింది. ఈ వీడియోలో శ్రీకాంత్ అనుచరుడు జగదీష్ తో పాటు మరికొందరు అనుచరులున్నారు. దీంతో నెల్లూరు రౌడీషీటర్లకు అడ్డాగా మారిందని పోలీసు రికార్డుల్లోకి కూడా ఎక్కింది. అయితే రౌడీషీటర్లు, రౌడీ మూకలు, సుపారీ గ్యాంగ్ లు పేట్రేగిపోవడానికి ప్రధాన కారణం పోలీసుల వైఫల్యమేనన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# మైనింగ్ కు బ్రేక్..!

**నెల్లూరు, తెలంగాణ దిశ :** నెల్లూరు తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీసుకున్న నిర్ణయం రాజకీయమేనని అంటు న్నారు. ఇకపై తాను మైనింగ్ నుంచి పూర్తిగా తప్పుకుంటున్నానని వేమిరెడ్డి ప్రకటించారు. క్వార్జ్ ఫ్యాక్టరీ నిర్మాణ ఆలోచన విరమించుకుం టున్నానని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. తనకు మైనింగ్ చేసే ఉద్దేశ్యమే లేదన్నారు. అలాగే క్వార్జ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయాలన్న ఆలోచనను కూడా విరమించుకుంటున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాలో బలమైన నేతగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆవిర్భవించారు. 2019 ఎన్నికలకు ముందే జగన్ పార్టీలో ఆయన చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తర్వాత 2019 నుంచి 2024 వరకూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వైసీపీలో కీలకంగానే వ్యవహరించారు. రైతన్నలకు ఒకే రోజు తీపికబురు సేవా కార్యక్రమాలతో... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సేవా కార్యక్రమాలతో నెల్లూరు జిల్లా ప్రజలకు అందరికీ సుపరిచితులు. ఆయన నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తాను ఎంపీ కాకముందు నుంచే తాగునీటి పథకాలను ప్రారంభించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేవారు. వీపీఆర్ ఫౌండేషన్ పేరుతో ఆయన సేవా కార్యక్రమాలను నిర్వహించుతూ వచ్చారు. కానీ 2019కి ముందు ఆయనకు రాజకీయాల్లోకి రావాలని గుబులు రేగి వైసీపీలో చేరి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అయితే 2019 నుంచి 2024 వరకూ నెల్లూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులతో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి పొసిగేది కాదు. దీంతో గ్యాప్ పెరిగింది. దీంతో పాటు తాను కోరిన స్థానాలు ఇవ్వకపోవడంతో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీలో చేరి 2024 లో నెల్లూరు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అయితే ఆయన మీద పదే పదే మైనింగ్ ఆరోపణలు వస్తున్నాయి. సొంత పార్టీ నేతలతో పాటు ప్రత్యర్థిపార్టీ నేతలు కూడా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటం ఆయనను కలసి వేసిందంటున్నారు ప్రతిపక్షాలకు, పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మైనింగ్ చేయకూడదని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.

# చేనేత ల కోసం కార్యక్రమం...

**గుంటూరు, తెలంగాణ దిశ:** ఏపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలను ఇంటి వద్దకే డెలివరీ చేసేలా చర్యలు తీసుకుంది. ఈ విషయాన్ని మంత్రి సవిత వెల్లడించారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు, రెడీ మేడ్ దుస్తులను ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లోనూ అందుబా టులోకి తెస్తున్నట్లు మంత్రి సవిత వివరించారు. చేనేత రంగం అభ్యున్నతి కోసం ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నేతన్నల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకునేందుకు పలు సంస్కరణలు చేపడుతోంది. చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. అలాగే పవర్ లూమ్స్ యజమానులకు కూడా నెలకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తున్న సంగతి తెలిసిందే. వీటితో పాటుగా థ్రిఫ్ట్ ఫండ్‌కు నిధులు కేటాయింపు ద్వారా చేనేతల కు ఆర్థిక భరోసాను అందిస్తోంది.



చేనేత రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చేనేత వస్త్రాలకు జీఎస్టీ భారం కూడా భరించాలని నిర్ణ యించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేత కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అందించటంతో పాటుగా.. చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచేందుకు ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ ద్వారా ఇంటి వద్దకే అందించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని మంత్రి సవిత వెల్లడించారు. త్వరలోనే చేనేత వస్త్రాలు ఇంటి ముందుకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేతకు మహర్దశ ప్రారంభమైందన్నారు. ఓవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెంటింగ్ సదుపాయం కల్పిస్తున్న ట్లు వివరించారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంలో భాగంగా.. ఏపీలో, జాతీయ స్థాయిలో చేనేత బజార్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేయడానికి.. ఆప్కో ద్వారా ఇంటి వద్దకే చేనేత వస్త్రాలు అందించే సదుపాయం తెస్తున్నట్లు మంత్రి సవిత వివరించారు. ఇందులో భాగంగా ఈ కామర్స్ సంస్థల ద్వారా అమ్మకాలు ప్రారంభించినట్లు వెల్లడించారు. పోచంపల్లి, మంగళగిరి, ధర్మవరం పట్టు చీరలతో పాటుగా ఆప్కో ద్వారా రెడీమేడ్ దుస్తులు కూడా ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టినట్లు మంత్రి సవిత వెల్లడించారు. పిల్లలు, మహిళలు, యువత, అన్ని వర్గాలను ఆకర్షించేలా.. అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. చేనేతల అభ్యున్నతే ధ్యేయంగా ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందన్న మంత్రి సవిత.. నేత కార్మికులకు సంవత్సరం పొడుగునా ఉపాధి, పని ఉండేలాచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

## 'బ్రెయిన్ డెడ్'గా ప్రకటన.. అంత్యక్రియలప్పుడు కదిలిన యువకుడు

ముంబై: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడ్ని 'బ్రెయిన్ డెడ్'గా హాస్పిటల్ ప్రకటించింది. కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా అతడు కదలడంతోపాటు దగ్గాడు. దీంతో షాకైన బంధువులు ఆ యువకుడ్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. త్రయంబకేశ్వర్ తాలూకాకు చెందిన 19 ఏళ్ల భావు లచ్కే కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అడ్గావ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించిన వైద్యులు అతడ్ని 'బ్రెయిన్ డెడ్'గా ప్రకటించారు. కాగా, భావును ఇంటికి తెచ్చిన కుటుంబ సభ్యులు శుక్రవారం అంత్యక్రియలకు సిద్ధమవుతున్నారు.

ఇంతలో ఉన్నట్టుండి అతడు కదలడంతో పాటు దగ్గాడు. దీంతో భావుబతికే ఉన్నట్లు గ్రహించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందతున్న ఆ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అతడి బంధువులు తెలిపారు. మరోవైపు ఆ యువకుడు మరణించినట్లుగా తాము చెప్పలేదని ఆ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. వైద్య పరమైన పదజాలంపై అతడి కుటుంబ సభ్యులు గందరగోళానికి గురై ఇంటికి తీసుకెళ్లారని ఆరోపించింది.

## ఈయూతో ఒప్పందం.. ఆ రంగానికి అవకాశాలు

ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం ద్వారా దేశీ ఆటో పరిశ్రమకు పెద్ద ఎత్తున అవకాశాలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర వాణిజ్య శాఖ స్పెషల్ సెక్రటరీ రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఎగుమతులను పెంచుకోవచ్చని, 27 దేశాల కూటమికి చెందిన ఆటోమొబైల్ దిగ్గజాలతో కొత్త భాగస్వామ్యాలకు అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భారత ప్రజలకు సరైన టెక్నాలజీ, సరైన రవాణా పరిష్కారాలను తీసుకొచ్చేందుకు వీలుంటుందన్నారు. ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయంటూ.. ఆటోమొబైల్ రంగానికి ఇది ఎంతో ముఖ్యమన్నారు. ఈయూలో మార్కెట్ అవకాశాలపై అవగాహన కుదిరిన వెంటనే చర్చలను త్వరగా ముగిస్తామని చెప్పారు. ఈయూ అధికారుల బృందం ఢిల్లీలో13వ విడత చర్చలు నిర్వహించిన నేపథ్యంలో అగర్వాల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. భారత ఆటోమొబైల్ రంగానికి సంబంధించి సుంకాల్లో రాయితీలు ఇవ్వాలని ఈయూ బృందం డిమాండ్ చేస్తుండడం గమనార్హం. ఈఏడాది మే6న బ్రిటన్‌తో కుదిరిన ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఆ దేశ ఆటోమొబైల్ కంపెనీలకు భారత్ రాయితీలను కల్పించడం తెలిసిందే. దీంతో ఈయూ సైతం ఇదే విధమైన డిమాండ్ చేస్తోంది. బ్రిటన్‌తో ఒప్పందంవల్ల ఆటోమొబైల్ దిగుమతులపై టారిఫ్‌లు 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గుతాయని అగర్వాల్ చెప్పారు.

## ప్రభుత్వం, ఆటో పరిశ్రమ కలిసి పని చేయాలి

న్యూఢిల్లీ: భౌగోళికరాజకీయ పరిస్థితులు మారిపోతున్న నేపథ్యంలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్‌లాంటి ముడి వస్తువులు, ఇతరత్రా టెక్నాలజీలపరమైన సమస్యలను అధిగమించాలంటే ప్రభుత్వం, ఆటో పరిశ్రమ కలిసి పని చేయాల్సి ఉంటుందని ఆటో విడిభాగాల సంస్థల సంఘం ఏసీఎంఏ ప్రెసిడెంట్ శ్రద్ధా సూరి మార్వా తెలిపారు. సవాళ్లను అవకాశాలుగా మల్చుకోవాలని, మొబిలిటీ విడిభాగాలకు భారత్‌ను విశ్వసనీయమైన హబ్‌గా నిలబెట్టాలనేదే తమ ఉమ్మడి లక్ష్యమని ఏసీఎంఏ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె వివరించారు. 'కీలకమైన ముడి వస్తువులు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, సెమీకండక్టర్లు మొదలైన వాటి కొరత పెద్ద సవాలుగా మారింది. దీనిపై జాతీయ స్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అపారమైన అవకాశాలకూడలిలో మనం ఇప్పుడు ఉన్నాం. స్థాయిలోసవాళ్లు కూడా ఉన్నాయి. వాణిజ్య యుద్ధాలు, భౌగోళికరాజకీయ ఒడిదుడుకులు, టారిఫ్‌లపరమైన ఉద్రిక్తతలు, ఎగుమతులపరంగా పరిమితుల్లాంటివన్నీ కూడా సరఫరా వ్యవస్థ స్వరూపాన్ని మార్చివేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కీలక ముడి వస్తువులను దక్కించుకునేందుకు ప్రభుత్వంతో మరింతగా కలిసి పనిచేయాలి. అలాగే కొత్త మార్కెట్లలోకి ప్రవేశించేందుకు ప్రపంచవ్యాప్తంగా భాగస్వామ్యాలను పటిష్టం చేసుకోవాలి. అంతర్జాతీయంగా పోటీపడే విధంగా మన పరిశ్రమ బలోపేతం కావాలి' అని మార్వా చెప్పారు. మరోవైపు, సరఫరా వ్యవస్థలనేవి కేవలం వ్యయాలను తగ్గించుకునే అంశానికే



పరిమితం కాకుండా వైవిధ్యంగా, ఎలాంటి అవాంతరాలెదురైనా నిలదొక్కుకునే విధంగా పటిష్టంగా మారాలని వాహనాల తయారీ సంస్థల సంఘం సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర సూచించారు. ఇందుకోసం వనరులు సమృద్ధిగా ఉన్న దేశాలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టాల్సి ఉందని ఆయన వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపార సంస్థల మధ్య సంబంధాలు ఎంత ముఖ్యమో, అలాగే అలాంటి భాగస్వామ్యాలకు దోహదపడేలా ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం కూడా ముఖ్యమేనని చంద్ర చెప్పారు.




## స్వల్పంగా పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో నమోదైన ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి నుంచి ఆగస్ట్ నెలలో కాస్తంత ఎగిసింది. జూలైలో 1.61% కాగా, ఆగస్ట్‌లో 2.07 శాతానికి చేరింది. కూరగాయలు, మాంసం, చేప లు, గుడ్లు, నూనెలు, ఫ్యాట్స్ ధరలు పెరగడం ఇందుకు దారితీసినట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) వెల్లడించిం ది. వినియోగ ధరల ఆధారిత సూచీ (సీపీఐ/రిటైల్ ద్రవ్యోల్బణం) తొమ్మిది నెలల పాటు వరుస క్షీణతకు ఆగస్ట్‌లో బ్రేక్ పడినట్టయింది. 2024 ఆగస్ట్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.65 శాతంగా ఉంది.ఆహార ద్రవ్యోల్బణం మైనస్ 0.69 శాతంగా నమోదైంది. జూలైలో ఇది మైనస్ 1.76%గా ఉంది. కూరగాయల ధరలు 15.92% పడిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం జూలైలో 1.18శాతంగా ఉంటే, ఆగస్ట్‌లో 1.69 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో 2.1 శాతం నుంచి 2.47 శాతానికి చేరింది.ఆహారం, పానీయాల విభాగాల్లోని ధరల పెరుగుదల వల్లే సీక్వెన్షియల్‌గా (నెలవారీగా) రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్ట్‌లో పెరగడానికి కారణమని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. సానుకూల ధోరణులు కనిపిస్తున్నప్పటికీ.. ఆగస్ట్ చివరి నుంచి సెప్టెంబర్ ఆరంభం వరకు అధిక వర్షాలు, వరదలు ఖరీఫ్ దిగుబడులపై ప్రభావం చూపిస్తాయని అభిప్రాయపడ్డారు. అంతిమంగా దిగుబడి, ధరల తీరును గమనించాల్సి ఉందన్నారు.

## మెగా పబ్లిక్ ఇష్యూలకు జోష్.. నిబంధనలను సరళతరం చేసిన సెబీ

ముంబై: స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ శుక్రవారం పలు కీలక సంస్కరణల్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే అతి భారీ సంస్థల కోసం ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) నిబంధనలను సరళతరం చేయాలని నిర్ణయించింది. సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే నేతృత్వంలో జరిగిన బోర్డు సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ఇవి రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వంటి బడా ఐపీవోలకు కలిసిరానున్నాయి. క్యాపిటల్ మార్కెట్స్ బలోపేతానికి, దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి, మదుపరుల ప్రయోజనాలకు పెద్దపీట వేయడానికి వీలుగా కొత్త మార్గదర్శకాలకూ లైన్‌క్లియరైంది.ఇదీ సంగతి.. మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నియమాలను అందుకోవడానికున్న గడువును 10 ఏండ్లదాకా సెబీ పొడిగించింది. ఈ మేరకు బోర్డు సమావేశం అనంతరం పాండే విలేకరులకు తెలియజేశారు. ఇక కొత్త విధివిధానాలు అమలైతే రూ.50,000 కోట్లు-లక్ష కోట్ల రూపాయల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో వచ్చే కంపెనీలకు ప్రస్తుతమున్న 10 శాతం కాకుండా 8 శాతం ఈక్విటీనే అవసరం. అలాగే 25 శాతం మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్‌ను మూడేండ్లకు బదులుగా ఐదేండ్లలోపు అందుకునే వెసులుబాటు కలగనున్నది. లక్ష కోట్ల రూపాయలకుపైగా మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న సంస్థలకు తప్పనిసరి ఆఫర్ రిక్వైర్‌మెంట్స్ 5 శాతం నుంచి 2.75 శాతానికి తగ్గించారు. రూ.5 లక్షల కోట్లకుపైగా మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉంటే 2.5 శాతం వాటా విక్రయిస్తే సరిపోతుంది. వీటికి 25 శాతం మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధన అమలుకు పదేండ్లదాకా గడువిచ్చారు. ఇప్పుడు 5 ఏండ్లుగానే ఉన్నది. దీంతో మొదట చిన్న ఐపీవోలతోనూ బడా సంస్థలు స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించే వీలు దొరుకుతున్నది. కాగా, ఐపీవోలో రూ.250 కోట్లకుపైగా కేటాయింపుల కోసం అనుమతి ఉన్న యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్యను పెంచాలని కూడా సెబీ ఈ సందర్భంగా నిర్ణయించింది. ఇదిలా ఉంటే ప్రతినెలా దేశంలోకి వందమంది విదేశీ పోర్ట్‌ఫోలియో మదు పరులు వస్తున్నట్లు సెబీ తెలిపింది. పెద్ద కంపెనీల కోసం మినిమం పబ్లిక్ ఆఫర్ పరిమాణం తగ్గింపు. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల్ని అందుకోవడానికి మరింత సమయం. పబ్లిక్ ఇష్యూలో యాంకర్ ఇన్వెస్టర్ల కేటాయింపుల్ని 33 శాతం నుంచి 40 శాతానికి పెంపు. షేర్‌హోల్డర్ అప్రూవల్ రిక్వైర్‌మెంట్స్ కోసం పరిమితుల సడలింపు. సెంట్రల్ బ్యాంకులు, సావరిన్ వెల్త్ ఫండ్స్, రెగ్యులేటెడ్ గ్లోబల్ కంపెనీల వంటి విశ్వసనీయ విదేశీ మదుపరులకు ఇకపై సింగిల్-విండో క్లియరెన్స్‌లు. ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్లలో రిటైల్ స్కీములను ఇక విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లుగా నమోదు చేసుకోవచ్చు. సడలించిన నిబంధనలతో అక్రిడిటెడ్ ఇన్వెస్టర్ల కోసం ప్రత్యేకంగా ఓ కొత్త ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ విభాగం. అక్రిడిటెడ్ ఇన్వెస్టర్ల కోసం కనీస పెట్టుబడి పరిమితిని రూ.70 కోట్ల నుంచి రూ.25 కోట్లకు తగ్గింపు. ఈక్విటీగా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు (రీట్)ల వర్గీకరణ. ఇన్విట్స్ మాత్రం హైబ్రిడ్‌గానే ఉంటాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు,




పట్టణాల నుంచీ పెట్టుబడులను ప్రోత్సహించేలా మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లకు 1 శాతం ప్రోత్సాహకాలు. మహిళా ఇన్వెస్టర్ల పెట్టుబడులపై అదనపు కమీషన్లు. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, రిసెర్చ్ అనలిస్టులు, మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్ల కోసం చేసిన సవరణలకు ఆమోదం. రిజిస్ట్రార్ల కోసం రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ సమీక్ష. ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో క్లోజింగ్ యాక్షన్ సెషన్ పరిచయాన్ని ప్రతిపాదిస్తూ తెచ్చిన కన్సల్టేషన్ పేపర్‌పై పబ్లిక్ కామెంట్స్‌కున్న గడువు ఈ నెల 19దాకా పొడిగింపు.

## గోల్డ్ లవర్స్‌కు బిగ్ షాక్

పసిడి ప్రియులకు భారీ షాక్. బంగారం ధరలు మళ్లీ కొండెక్కి కూర్చున్నాయి. గత కొద్దిరోజులుగా పెరుగుతున్న ధరలకు గురువారం బ్రేకులు పడ్డాయి. దీంతో తగ్గుముఖం పడతాయని అనుకుంటున్న సమయంలో మళ్లీ పైపైకి వెళ్లిపోతున్నాయి. శుక్రవారం బంగారం ధరలు ఆల్‌టైమ్ రికార్డ్ సృష్టించాయి. నేడు తులం బంగారం ధరపై రూ.771 పెరిగింది. అలాగే సిల్వర్ ధర కూడా హడలెత్తిస్తోంది. కిలో వెండిపై రూ.2,100 పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 771 పెరిగి రూ.1, 11, 280 దగ్గర అమ్ముడవుతోంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.700 పెరిగి రూ.1,02,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.580 పెరిగి రూ.83, 460 దగ్గర అమ్ముడవుతోంది. ఇక కిలో వెండిపై రూ.2,100 పెరిగి రూ.1, 32, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది.




## చైనా సంచలనం.. అమెరికా చిప్ లేకుండా 'బ్రెయిన్' ఏఐ నమూనా

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌రంగంలో చైనా మరో కీలక అడుగు వేసింది. స్పైకింగ్‌బ్రెయిన్ 1.0 1.0) అనే "మెదడు ప్రేరిత" లాంగ్వేజ్ మోడల్‌ను విడుదల చేసింది. ఇది ఎన్విడియా చిప్‌లు లేకుండానే సంప్రదాయ ఏఐ మోడళ్ల కంటే 100 రెట్లు వేగంగా పనిచేస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ మోడల్‌ను చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆటోమేషన్ అభివృద్ధి చేసింది. ఇది న్యూరోమార్ఫిక్ డిజైన్ ఆధారంగా పనిచేస్తుంది. అంటే మన మెదడు లాగా, అవసరమైన న్యూరాన్లు మాత్రమే స్పందిస్తాయి. ఈ "స్పైకింగ్ కంప్యూటేషన్" పద్ధతి వల్ల విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. అలాగే ట్రైనింగ్ డేటా అవసరం కూడా చాలా తక్కువగా ఉంటుంది. స్పైకింగ్‌బ్రెయిన్.. చాట్‌జీపీటీ లాంటి మోడళ్లకు అవసరమైన ట్రైనింగ్ డేటాలో కేవలం 2 శాతం మాత్రమే ఉపయోగించి, వాటితో సమానమైన పనితీరును అందిస్తుందని ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకుడు లి గువోకి తెలిపారు. ఈ మోడల్ చైనాలోనే అభివృద్ధి చేసిన మెటాఎక్స్ చిప్‌లపై పనిచేస్తుంది. అమెరికా జీపీయూ ఎగుమతి స్వతంత్ర ఏఐ మౌలిక సదుపాయాల వైపు చైనా అడుగులు వేస్తోంది. స్పైకింగ్‌బ్రెయిన్..

దాని డెమో సైట్ లో తనను తాను ఇలా పరిచయం చేసుకుంటుంది. "హలో! నేను స్పైకింగ్ బ్రెయిన్ 1.0, లేదా 'షుంక్సీ', మెదడు-ప్రేరేపిత ఏఐ మోడల్‌ని. మానవ మెదడు సమాచారాన్ని స్పైకింగ్ కంప్యూటేషన్ పద్ధతితో ప్రాసెస్ చేసే విధానాన్ని నేను మిళితం చేస్తాను. పూర్తిగా చైనీస్ టెక్నాలజీపై నిర్మించిన శక్తివంతమైన, నమ్మదగిన, శక్తి-సమర్థవంతమైన ఏఐ సేవలను అందించగలను" అంటోంది.

## ఈక్విటీ ఫండ్స్‌లో తగ్గిన పెట్టుబడుల జోరు!

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడుల జోరు ఆగస్ట్‌లో కొంత తగ్గింది. రూ.33,430 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జూలైలో రూ.42,702 కోట్ల పెట్టుబడులతో పోల్చి చూస్తే 22 శాతం తగ్గాయి.ఈఏడాది జూన్‌లో రూ.23,587 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం. 2024 ఆగస్ట్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.38,239 కోట్లుగా ఉన్నాయి. డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.7,980 కోట్లు నికరంగా బయటకు వెళ్లాయి. జూలైలో రూ.1.06 లక్షల కోట్ల నికర డెట్ పెట్టుబడులతో పోల్చి చూస్తే భిన్నమైన పరిస్థితి కనిపించింది. దీంతో ఆగస్ట్ చివరికి మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.75.20 లక్షల కోట్లకు పరిమితమైంది. జూలై చివరికి ఈ మొత్తం రూ.75.36 లక్షల కోట్లుగా ఉంది. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. ఆగస్ట్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు నీరసించడం వెనుక కొత్త పథకాల (ఎన్ఎఫ్‌వో) ఆవిష్కరణ తగ్గడమే కారణమని నిపుణులు చెబుతున్నారు.

## ఇన్ఫీ18,000 వేల కోట్ల రికార్డ్ బైబ్యాక్

న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కి అంగీకరించింది. గురువారం (11న) సమావేశమైన బోర్డు షేరుకి రూ. 1,800 ధర మించకుండా 2.41 శాతం వాటా బైబ్యాక్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 18,000 కోట్లు వెచ్చించనుంది. వెరసి రూ. 5 ముఖ విలువగల 10 కోట్ల ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయనుంది. గురువారం బీఎస్ఈలో ముగింపు ధర రూ. 1,510తో పోలిస్తే బైబ్యాక్‌కు 19 శాతం ప్రీమియంను నిర్ణయించింది. కంపెనీ 2025 జూన్ త్రైమాసికంలో 88.4 కోట్ల డాలర్ల (రూ. 7,805 కోట్లు) ఫ్రీ క్యాష్ ఫ్లోను ప్రకటించింది. కాగా.. కంపెనీ తొలిసారి 2017లో ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టింది. ఈక్విటీలో 4.92 శాతం వాటాకు సమానమైన 11.3 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. ఇందుకు ఒక్కో షేరుకి రూ. 1,150 ధరలో రూ. 13,000 కోట్లు వెచ్చించింది. ఆపై రెండోసారి 2019లో రూ. 8,260




కోట్లు, మూడోసారి 2021లో 9,200 కోట్లు చొప్పున షేర్ల బైబ్యాక్‌కు వినియోగించింది. ఈ బాటలో 2022లోనూ రూ9,300 కోట్లతో ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.1,850 ధర మించకుండా బైబ్యాక్ చేపట్టింది.

## స్టార్టప్‌లకు 'గేమింగ్' నిషేధం సెగ..



ముంబై: దేశీయంగా రియల్ మనీ గేమ్స్ (ఆర్ఎంజీ)పై నిషేధం విధించడంతో పలు అంకురాల వాల్యుయేషన్‌పై ప్రభావం చూపింది. నాలుగు బడా సంస్థలు .. యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల విలువ చేసే అంకురాలు) జాబితా నుంచి చోటు కోల్పోయాయి. డ్రీమ్11 (26 కోట్ల యూజర్లు) , గేమ్స్ 24 7 (12 కోట్ల యూజర్లు), గేమ్స్‌క్రాఫ్ట్ (3 కోట్ల యూజర్లు), మొబైల్ ప్రీమియర్ లీగ్ (9కోట్ల యూజర్లు) వీటిలో ఉన్నాయి. ఇక యూనికార్న్‌లు కాకపోయినప్పటికీ 'జూపీ', 'విన్‌జో గేమ్స్'లాంటి సంస్థల వాల్యుయేషన్లు కూడా పడిపోయాయి. '2025 ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా యూనికార్న్, ఫ్యూచర్ యూనికార్న్' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ఆన్‌లైన్ మనీ గేమ్స్‌ను నిషేధించే బిల్లును పార్లమెంటు గత నెల ఆమోదించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం ఆన్‌లైన్ మనీ గేమ్స్ సంబంధిత ప్రకటనలపై కూడా నిషేధం వర్తిస్తుంది. అలాంటి గేమ్స్ ఆడేందుకు నగదును బదిలీ చేసే సర్వీసులను సైతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించకూడదు. "ఇలాంటి మార్పులన్నింటి వల్ల భారత్‌లో పేరొందిన పలు ఆర్ఎంజీ కంపెనీలపై ప్రభావం పడింది. వృద్ధి నెమ్మదించే అవకాశం ఉంది" అని నివేదిక పేర్కొంది. అలాగే ఈ చట్టం వల్ల పరిశ్రమపై ఇన్వెస్టర్ల నమ్మకం కూడా సడలిందని వివరించింది. మరోవైపు,అంకురాలు క్రమంగా లాభదాయ కత,

పెట్టుబడులను సమర్థంగా వినియోగించుకోవడం, దీర్ఘకాలంలో నిలకడగా ఉండే వ్యాపార విధానాల వైపు మొగ్గు చూపుతున్నాయని ఆస్క్ ప్రైవేట్ వెల్త్ ఎండీ రాజేశ్ సలూజా తెలిపారు. 8.2 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో అత్యంత విలువైన భారతీయ స్టార్టప్‌గా డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థ జిరోధా అగ్రస్థానంలో ఉంది. చెరి 7.5 బిలియన్ డాలర్లతో ఫిన్‌టెక్ సంస్థ రేజర్‌పే, లెన్స్‌కార్ట్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అత్యధికంగా 26 అంకురాలతో బెంగళూరు యూనికార్న్ హబ్‌గా నిల్చింది. వీటి మొత్తం వాల్యుయేషన్ 70 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక 36.3 బిలియన్ డాలర్ల విలువ చేసే 12 స్టార్టప్‌లతో ఢిల్లీ%-%ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్) రెండో స్థానంలో, 22.8 బిలియన్ డాలర్ల విలువ చేసే 11సంస్థలతో ముంబై మూడో స్థానంలో నిల్చాయి. దేశీయంగా అత్యంత పిన్న వయస్కులైన యూనికార్న్ వ్యవస్థాపకులుగా జెప్టో ఫౌండర్లు కైవల్య ఓహ్రా, ఆదిత్ పలిచా (ఇద్దరికీ 22 ఏళ్లు) నిల్చారు. వెంచర్ క్యాపిటల్ సంస్థ పీక్ ఫిఫ్టీన్ పార్ట్‌నర్స్ భారతీయ స్టార్టప్స్‌లో అత్యధికంగా ఇన్వెస్ట్ చేసింది.

టర్టిల్‌మింట్, వాట్‌ఫిక్స్, గ్రో, ప్రిజమ్ అంకురాల్లో 200 మిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు పెట్టింది. అత్యంత విలువైన స్టార్టప్‌లు ఏకంగా 3.74 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. యూనికార్న్‌లలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 2.06 లక్షలుగా ఉంది. కొన్ని ఆర్ఎంజీ కంపెనీలు లిస్టు నుంచి నిష్క్రమించినప్పటికీ ఈ ఏడాది యూనికార్న్‌ల జాబితాలోని స్టార్టప్‌ల సంఖ్య మొత్తం మీద పెరిగి, 73కి చేరింది. ఈ ఏడాది 11 అంకురాలు యూనికార్న్ హోదా దక్కించుకున్నాయి. ఏఐడాట్‌టెక్, నవీ టెక్నాలజీస్, వివృతి క్యాపిటల్, వెరిటాస్ ఫైనాన్స్, ర్యాపిడో, నెట్రాడైన్, జంబోటెయిల్, డార్విన్‌బాక్స్, మనీవ్యూ, జస్‌పే, డ్రూల్స్ వీటిలో ఉన్నాయి.

## జియో కొత్త టెక్నాలజీ: టెన్షన్ లేకుండా 5జీ నెట్.. కాలింగ్

వినియోగదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రిలయన్స్ జియో తన సేవలను నిరంతరం అప్ డేట్ చేస్తూనే ఉంది. కాల్స్ చేయడంలో ఉన్న సమస్యలను అధిగమించేందుకు దేశవ్యాప్తంగా వాయిస్ ఓవర్ న్యూ రేడియో అనే ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టింది. ఈ జియో సర్వీస్ వారి సొంతంగా పనిచేస్తుంది, అంటే స్వదేశీ 5జీ స్వతంత్రకోర్. ఈ సేవతో ప్రతి 5జీ ఫోన్ మినీ స్టూడియోగా మారుతుందని జియో పేర్కొంది. ఇప్పటి వరకు చాలా టెలికాం కంపెనీలు 5జీ ఇంటర్నెట్ ను అందిస్తున్నప్పటికీ, కాలింగ్ కోసం బ్యాక్ ఎండ్ లో 4జీ నెట్ వర్క్ పైనే ఆధారపడేవి. వీవోఎన్ఆర్ ఈ అంతరాన్ని పూరిస్తుంది. వినియోగదారులకు పూర్తిగా 5జీ కోర్ ఆధారంగా కాలింగ్ అనుభవాన్ని ఇస్తుంది. జియో కొత్త టెక్నాలజీ వోఎల్టీఈ వంటి పాత వ్యవస్థల స్థానంలో వీఓఎన్ఆర్ భర్తీ చేస్తోంది. ఈ 5జీ ఫోన్ నేటివ్ వాయిస్ కాల్స్ ను అందిస్తుంది. ఈ టెక్నాలజీ కారణంగా, కాల్ త్వరగా కనెక్ట్ అవుతుంది. దీని రాకతో, కాల్ డ్రాప్‌లు, వాయిస్ బ్రేక్ వంటి సమస్యలు కూడా దాదాపుగా తొలగిపోతాయి. దీంతో యూజర్ల ఫోన్ బ్యాటరీని కూడా ఆదా చేస్తుందని జియో చెబుతోంది. దీనితో పాటు కాల్ రూటింగ్, నెట్ వర్క్ ఎఫిషియెన్సీ మెరుగ్గా ఉంటుంది. జియో తన వీఓఎన్ఆర్ రోల్ అవుట్ పూర్తిగా స్వదేశీ టెక్నాలజీ స్టాక్ పై ఆధారపడి ఉందని పేర్కొంది. దీని అర్థం బ్యాక్ ఎండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుండి సర్వీస్ మేనేజ్మెంట్ వరకు ప్రతిదీ భారతీయ ఇంజనీర్లు, భాగస్వాముల సహాయంతో నిర్మించినదే.

ఇది సాంకేతిక స్వాతంత్ర్యం వైపు ఒక పెద్ద అడుగు మాత్రమే కాదు, భవిష్యత్తులో భారతదేశాన్ని డిజిటల్ పరిష్కారాలను ఎగుమతి చేసే దేశంగా మార్చగలదు. ఫాస్ట్ కాల్ కనెక్షన్-ఫోన్ చేసిన కొన్ని సెకండ్లలోనే కాల్ కనెక్ట్ అవుతుంది. మెరుగైన వాయిస్ క్వాలిటీ-హెచ్‌డీం సౌండ్ సంభాషణను మరింత స్పష్టంగా చేస్తుంది. కాల్ డ్రాప్ లు తగ్గడం-నెట్ వర్క్ స్విచింగ్ వల్ల ఎలాంటి సమస్య ఉండదు. బ్యాటరీ సేవింగ్: ఫోన్ 4జీ, 5జీ మధ్య పదే పదే షిఫ్ట్ అవ్వాల్సిన అవసరం లేదు. మెరుగైన ఇంటర్నెట్ కాలింగ్ - కాల్ లో మాట్లాడేటప్పుడు కూడా ఇంటర్నెట్ బ్రౌజింగ్ 5జీ వేగంతో కొనసాగుతుంది.




# పెద్ది షూటింగ్‌కి బ్రేక్..!




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో, 'ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం'పెద్ది'. 'గేమ్ ఛేంజర్' చిత్రంతో నిరాశ చెందిన అభిమానులు ఇప్పుడు ఈ కొత్త సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'రంగస్థలం' తరహాలో మాస్, రా లుక్‌లో చెర్రీ కనిపించడంతో పాటు ఫస్ట్ లుక్, గ్లింప్స్‌తో సినిమాపై క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా రామ్‌చరణ్ కొట్టిన క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది.ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ రామ్‌చ రణ్‌కు జోడిగా నటిస్తోంది.ఇది రామ్ చరణ్‌తో చేస్తున్న తొలి తెలుగు సినిమా కావడంతో,ఈ కాంబోపై మంచి హైప్ ఏర్పడింది. తెరవెనుక బుచ్చిబాబు జెట్ స్పీడ్‌తో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సినిమాకు సంబంధించి 50 శాతం పైగా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్ శివారులో వేసిన భారీ సెట్‌లో యాక్షన్ సీన్ చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో చరణ్, జాన్వీ ఇద్దరూ పాల్గొంటున్నారు. షూటింగ్ బ్రేక్ సమయంలో, బుచ్చిబాబు-జాన్వీ కలిసి హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లో సినిమా వీక్షించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే అనూహ్యంగా తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. యాక్షన్ ఎపిసోడ్ పూర్తిగా ఔట్‌డోర్‌లో చేస్తుండడంతో వాతావరణం సహకరించక పోవడం వలన బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. వర్షాలు తగ్గిన వెంటనే మళ్లీ షూటింగ్‌ను పునఃప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ సినిమా ఉత్తరాంధ్ర విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోంది. ఇందులో వచ్చే ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్, భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడనంత విజువల్ ట్రీట్‌గా ఉంటుందని తెలుస్తోంది. 'రంగస్థలం' కంటే ఇది చాలా గొప్పగా ఉంటుందని రామ్‌చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. తర్వాత సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నాడు. ఈ కాంబోలో వచ్చిన 'రంగస్థలం' ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఇకపోతే, చరణ్ ప్రస్తుతం మరో రెండు మూడు ప్రాజెక్టుల కోసం కథలు వింటున్నట్లు సమాచారం

# సినిమా..

## రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రామాయణ





బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో ఒకటి రామాయణ దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతు న్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు-ఉత్సాహంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్తగానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు

## మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు...



సోషల్ మీడియాలో తరచుగా సెలబ్రిటీలపై ట్రోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ట్రోలింగ్‌లు, ప్రతికూల వ్యాఖ్యలపై నటీనటులు అప్పుడప్పుడు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తునే ఉన్నారు. తాజాగా ఈ విషయంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో వచ్చే అనవసర విమర్శలపై రకుల్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించింది. రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియా ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. దురదృష్టవశాత్తూ, మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు. వారందరికీ ఉచిత డేటా ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల, ఇతరుల జీవితాల గురించి కామెంట్స్ చేయడం తప్ప వారికి ఇంకేమీ పనిలేకుండా పోయింది" అని అన్నారు. కాగా రకుల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.మరోవైపు రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న వేధింపులు, ట్రోలింగ్‌కు అద్దం పడుతున్నాయి. ఉచిత డేటా ప్లాన్‌ల లభ్యత, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం వల్ల ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు సులభంగా చేరువయ్యారని, అయితే దీనిని దుర్వినియో గం చేసే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆమె పరోక్షంగా అభిప్రాయపడ్డారు.

# స్టన్నింగ్ స్టిల్స్‌తో ఐశ్వర్య మీనన్



గ్లామర్ ప్రపంచంలో తనదైన స్థానం ఏర్పర్చుకుంటున్న నటి ఐశ్వర్య మీనన్ మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. తాజాగా ఆమె నీయాన్ పింక్ లెహంగాలో చేసిన ఫోటోషూట్ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. బ్రైట్ కలర్ లెహంగా, ఫ్లోరల్ వర్క్‌తో ఉన్న బ్లౌజ్, జ్వెలరీ అన్నీ కలిసినప్పుడు ఐశ్వర్యఅందం మరింత మెరిసిపోయింది. తన నడుము, గ్లామర్ యాంగిల్స్‌ను బోల్డ్‌గాఎలివేట్ చేసిన ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐశ్వర్య ఫ్యాషన్ సెలెక్షన్ ఈసారి మరింత స్టైలిష్‌గా నిలిచింది. లైటింగ్,పౌజింగ్, మేకప్ అన్నీ కలిసే ఆమె లుక్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కుర్చీలోనిదానంగా కూర్చున్న స్టిల్స్‌లో ఆమె క్యూట్ హావభావాలతో ఆకట్టుకోగా, బయట తీసిన ఫోటోలలో ఆమె కొంటె లుక్స్‌తో మరింత అందంగా కనిపించింది. తన ఫోటోషూట్స్‌తో పాటు సినిమాల్లోనూ మంచి గుర్తింపు సంపాదించుకున్న ఐశ్వర్య, కెరీర్ విషయంలో అడుగడుగునా మెరుగైపోతుంది. తమిళంలో 'హిప్పీ', 'తామిళ్ ప్యెలట్', మలయాళంలో 'మన్‌త్రీ', 'బజూక' వంటి చిత్రాలతో పాపులర్ అయ్యింది.
తెలుగులో నిఖిల్ సరసన నటించిన'స్పై' మూవీ ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై మిశ్రమ స్పందన పొందినప్పటికీ, ఐశ్వర్యకి నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది.
ప్రస్తుతం ఆమెకు తెలుగు, తమిళ భాషల్లో మంచి ఆఫర్స్ వస్తున్నా యి. బోల్డ్ లుక్స్, గ్లామర్ ప్రెజెంట్ చేయగల సామర్థ్యం ఉన్న నటి అయిన ఐశ్వర్య, ప్రస్తుతం కంటెంట్ బేస్డ్ పాత్రలవైపు అడుగులు వేస్తోందని టాక్. ఇటీవలి ఫోటోషూట్ చూస్తే ఆమె కొత్తగా ఒక ట్రెండ్ సెట్ చేయబోతుందనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి స్టైలిష్ ప్రెజెన్స్‌తో పాటు నటనలో తనదైన ముద్ర వేసే ఐశ్వర్య మీనన్, త్వరలోనే తెలుగులో ఒక మిడ్‌రేంజ్ హీరో సరసన నటించే అవకాశం ఉందని సమాచారం.

## మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభిం చారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215